

మున్నేటి వరదలో మునిగిన లారీలు

గతేడాది మున్నేరు ఉధృతి ఇలా..!

మున్నేరు కన్నీటికి ఏడాది



ఖమ్మంలో వరద ప్రాంతాల్లో పర్యటిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ఖమ్మంలో వరద బాధితులతో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి (ఫైల్)

- త్వరితగతిన కోలుకున్న నగరం
- నేతలు, అధికారులు, స్వచ్ఛంద సంస్థల కృషి
- వరద కట్టలతోనే శాశ్వత వరద నివారణకు అడ్డుకట్ట
- వేగంగా జరుగుతున్న పనులు

ఖమ్మం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/ న్యూస్ నెట్‌వర్క్: మున్నేరు కన్నీటికి సరిగ్గా ఏడాది. గతేడాది ఆగస్టు 31న మున్నేరు పరివాహక ప్రాంతంలో మునుపెన్నడూ లేని విధంగా భారీ వర్షం పడింది. కూసుమంచిలో 31.53 సెం.మీ. వర్షం.. ఆ పై ఆకేరులో కూడా అదే స్థాయిలో వర్షం పడడం.. ఆకస్మికంగా ఆకేరు, మున్నేరుకు వరద వచ్చి పడడంతో పరివాహక ప్రాంతంలోని కాలనీలు నీట మునిగాయి. ఆకస్మికంగా వచ్చి పడిన వరద అనేక కుటుంబాలను చిన్నాభిన్నం చేసింది. కట్టుకున్న దుస్తులతోనే ఇళ్లు వదిలి బయటకు రాగా.. ఇళ్లల్లోని బీరువాలు, డబ్బులు, దుస్తులు, వస్తువులు, ఎలక్ట్రానిక్ పరికరాలు, ఫ్రిజ్‌లు, ఏసీలు, టీవీలు ఇలా సర్వం మున్నేరు నీటి వరదకు గురై బురదమయం అయ్యాయి. ఒక్కో కుటుంబం రూ.లక్షల్లో నష్టపోయింది. సాయంత్రం, రాత్రి కురిసిన వర్షంతో ఉదయమే వరద వచ్చి కట్టుబట్టలతోనే పునరావాస కేంద్రాలకు వరద బాధితులు కదలాల్సి వచ్చింది. వేలాది కుటుంబాలు సర్వం కోల్పోయాయి. కనీసం ఇప్పట్లో కోలుకుంటాయా.. లేదా.. అని ఆవేదన చెందినా రాష్ట్ర మంత్రులు, అధికార యంత్రాంగం కృషితో మళ్లీ కుటుంబాలు కోలుకున్నాయి. జరిగిన నష్టం పూర్తిగా అందించలేకపోయినా.. మళ్లీ జీవించే చేయూత అందించడం, ప్రాణనష్టం జరగకుండా సకాలంలో వరద బాధితులను పునరావాస కేంద్రాలకు చేర్చడం, వరదల్లో చిక్కిన వారిని ఎన్డీఆర్ఎఫ్ బృందాలతో ప్రాణాలతో కాపాడడం అంతా వేగంగా జరిగిపోయాయి. ప్రకాష్‌నగర్ బ్రిడ్జి మీద వరదలో కొందరు, తిరుమలాయపాలెం మండలంలో పశువుల కాపరులతో పాటు ఖమ్మం నగరంలో, కరుణగిరి ప్రాంతంలో, అపార్టుమెంట్లలోనూ చిక్కుకుని వరద తగ్గే వరకూ కాలం గడిపారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా వరదల్లో చిక్కుకొని కిందకు వెళ్లలేక.. పునరావాస కేంద్రానికి పోలేక జీవచ్ఛవంలా ఉండిపోయారు. క్షణ క్షణం భయం భయంతో జీవించారు. గోదావరి వంటి వరదలకు ఉమ్మడి జిల్లాలో విపత్తు పరిస్థితి ఎదుర్కోగా.. మున్నేరు, ఆకేరు వంటి ఏర్లతో కూడా ఆస్తి, ప్రాణనష్టం ఉంటుందని.. గతంలో ఎన్నడూ లేని విధంగా విచిత్ర పరిస్థితిని జిల్లా ప్రజలు చూశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, జిల్లా మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డితోపాటు అప్పటి కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, ప్రస్తుత నగర పోలీసు కమిషనర్ సునీల్‌దత్, ప్రస్తుత నగర మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య తదితరులు చూపించిన చొరవ సహాయ కార్యక్రమాల్లో పగలు రాత్రి శ్రమించి బాధితులకు భరోసా ఇచ్చారు. తిరిగి తమ తమ ఇళ్లకు (మిగతా 6వ పేజీలో)

కళ్లెదుటే జల విలయం

- ఉప్పొంగిన పాలేరు జలాశయం
- జల దిగ్బంధమైన 8 గ్రామాలు
- బతుకుజీవుడా కోసం వచ్చి గల్లంతైన దంపతులు
- గతేడాది ఘటనను గుర్తు చేసుకుంటున్న స్థానికులు



కూసుమంచి మండలం నాయకన్‌గూడెం వద్ద కొట్టుకుపోయిన పెట్రోల్‌బంక్

6

విద్యాశాఖలో ఖాళీ పోస్టుల సర్దుబాటు

సందడి

- ఎస్‌జీటీలు 410, ఎస్‌ఏ 143 పోస్టులు ఖాళీ
- పైరవీల జోరు
- 4లోగా సర్దుబాటు ప్రక్రియ పూర్తి

కొత్తగూడెం ఎడ్యుకేషన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖలో ఖాళీ గా ఉన్న పోస్టుల్లో సర్దుబాటు ప్రక్రియ ప్రారంభమైంది. రాష్ట్ర విద్యాశాఖ ఈనెల 4వ తేదీ లోగా సర్దుబాటు ప్రక్రియ పూర్తి చేసి నివేదిక అందజేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేసింది. వాస్తవానికి ఆగస్టు 30వ తేదీ లోగా ఖాళీ పోస్టుల సర్ధుబాటు పూర్తి చేయాలి. కోర్టు ఆదేశాల మేరకు ఉపాధ్యాయుల హెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్ పదోన్నతి ప్రక్రియ ప్రారంభించారు. జిల్లాలో ఇప్పటి వరకు 24 ప్రధానోపాధ్యాయులు, 177 పోస్టుల స్కూల్ అసిస్టెంట్‌లను పదోన్నతుల ద్వారా భర్తీ చేశారు. వీరిలో కొంతమంది ఇతర జిల్లాలకు, సుదూర ప్రాంతాలకు వెళ్లిపోవడం జరిగింది. ప్రస్తుతం జిల్లాలో స్కూల్ సెకండరీ ట్రైనింగ్ (ఎస్‌జీటీ)పోస్టుల ఖాళీలు 400పైగా ఉన్నాయి. వీటిలో 70శాతం పోస్టుల సర్దుబాటు చేయాల్సి ఉంది. స్కూల్ అసిస్టెంట్స్ ఖాళీలు 143 వరకు ఉన్నాయి. విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఖాళీగా ఉన్న పోస్టుల్లో సర్దుబాటు (మిగతా 6వ పేజీలో)

యూరియా దొరక్క..

- అన్నదాతల అష్టకష్టాలు..
- ప్రైవేట్ దుకాణాల్లో నిల్వలు ఫుల్.. సొసైటీల్లో నిల్..
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ

కొత్తగూడెం అర్బన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : యూరియా కోసం జిల్లా రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. సొసైటీలకు, మార్క్‌ఫెడ్‌లకు సరఫరా కావాల్సిన యూరియా జిల్లాలో దారి మళ్లుతోంది. ప్రైవేట్ డీలర్ల ద్వారా విక్రయిస్తూ.. రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారు. ఒక వైపు వర్షాలు అధికంగా కురవడం.. ఆరుగాలం శ్రమించే కర్షకులకు ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో అండగా నిలవాల్సిన అధికారులు కొరత సాకుతో నరకం చూపుతున్నారు. గోదావరి వరదలతో లక్షలాది ఎకరాల ముంపునకు గురైనట్లు చెబుతుండగా.. పంటలను కాపాడుకునేందుకు రైతులు (మిగతా 6వ పేజీలో)

యూరియా కొరతకు..

కేంద్రానిదే బాధ్యత

- బీజేపీ, బీఆర్ఎస్‌లు నిరసనలు చేయడం హాస్యాస్పదం
- ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న ఫాసిజం
- సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌సింగ్ ఠాగూర్
- ఖమ్మంలో ముగిసిన జాతీయ కౌన్సిల్ సమావేశాలు



ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతులకు సకాలంలో యూరియా అందక పోవడానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమే కారణమని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌సింగ్ ఠాగూర్ అన్నారు. ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో బీజేపీ ఇలాంటి ఇబ్బందులు సృష్టిస్తోందన్నారు. సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జాతీయ కౌన్సిల్ సమావేశాలకు ఖమ్మం నగరం వేదికైంది. ఈనెల 29న ప్రారంభమైన జాతీయ సమావేశాలు ఆదివారంతో ముగిశాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్ర, కేరళ, ఢిల్లీ, త్రిపుర రాష్ట్రాలకు చెందిన జాతీయ కౌన్సిల్ సభ్యులు ఈ సమావేశానికి హాజరయ్యారు. పలు కారణాలతో మరో పది రాష్ట్రాల ప్రతినిధులు హాజరు కాలేకపోతున్నామని సమాచారం అందించారు. కౌన్సిల్ సమావేశంలోని తీర్మానాలను సమావేశంలో పాల్గొన్న అందరూ ఆమోదించారు. ఈ సందర్భంగా ఆదివారం ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌సింగ్ ఠాగూర్ మాట్లాడుతూ.. మూడు రోజుల పాటు జరిగిన కౌన్సిల్ సమావేశాలను వివరించారు. తెలంగాణ రాష్ట్రానికి 12లక్షల మెట్రిక్ టన్నుల యూరియా డిమాండ్ ఉందని ప్రభుత్వం నివేదికలు పంపితే.. ఇప్పటి వరకు కేవలం 5లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే వచ్చిందన్నారు. ఈ విషయమై బీజేపీ, బీఆర్ఎస్‌లు నిరసనలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న ఫాసిజం ధోరణితో పాటు పాత్రికేయులు, దళితులు, గిరిజనులపై దాడులు హత్యలు పెరిగాయన్నారు. గతంలో కొన్ని దేశాలకే పరిమితమైన ఫాసిజం ఇప్పుడు అన్ని దేశాలకు విషవాయువుగా వ్యాప్తి చెందుతుందన్నారు. పాలస్తీనా నుంచి భారతదేశం వరకు పాత్రికేయులు, మహిళలు, ప్రతిపక్షాలు, నిరుపేదలపై ఏకపక్షంగా దాడులు పెరుగుతున్నాయని ఆరోపించారు. అమెరికా సుంకాలు పెంచడంతో ఇప్పుడు ప్రధానమంత్రి మోదీకి పొరుగు దేశాలు గుర్తుకొచ్చాయని.. ఈ నేపథ్యంలోనే చైనాతో సంబంధాలు పెట్టుకోవడం మంచి పరిణామంగా పేర్కొన్నారు. అయితే మోదీ తీరును మాత్రం నమ్మలేమన్నారు. జీఎస్‌టీని పూర్తిగా రద్దు చేయాలని, హిందీ భాషను బలవంతంగా రుద్దే ప్రయత్నాలు మానుకోవాలని డిమాండ్ చేశారు. పదేళ్ల కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పార్టీ ఆర్ఎస్ఎస్ విధానాలను అమలు చేస్తూ హిందూ రాజ్య స్థాపనే లక్ష్యంగా పని చేస్తోందన్నారు. దక్షిణాది రాష్ట్రాలపై బీజేపీ ప్రభుత్వం కుట్ర పూరితంగా వ్యవహరిస్తోందని, అందుకే దక్షిణాది రాష్ట్రాల సమస్యలపై ఉద్యమ కార్యాచరణకు అక్టోబరులో హైదరాబాద్‌లో సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ సదస్సు నిర్వహిస్తుందని ప్రకటించారు. అనంతరం జాతీయ సహాయ కార్యదర్శి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోటు రంగారావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో యూరియా కొరతకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమే కారణమని విమర్శించారు. ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలకు కావాల్సిన మేరకు యూరియా సరఫరా చేయడం లేదని ఆరోపించారు. టం లేదని ఆరోపించారు. ఈ సమావేశంలో జాతీయ కౌన్సిల్ సభ్యులు సుభాష్‌దేవ్, దేవ్‌భద్రశర్మ, కేజీ రామచందర్, కే రమ, గోకినేపల్లి వెంకటేశ్వర్లు, వీ కృష్ణ, కే సూర్యం, తిమాల్‌పాండే, కృష్ణగోగోయ్, పూజారీ, ప్రవీన్‌నడ్కర్, ఉమాకాంత్, సీ భాస్కర్‌రావు, జీ రామయ్య, ఆవుల అశోక్, సీవై పుల్లయ్య పాల్గొన్నారు.



స్వల్పంగా పెరిగి..

ఆ పై తగ్గుముఖం!

- రెండో ప్రమాద హెచ్చరికకు చేరిక.. ఉప సంహరణ
- కొనసాగుతున్న మొదటి ప్రమాద హెచ్చరిక
- 47.8 అడుగుల వద్ద నిలకడగా ప్రవాహం



భద్రాచలం వద్ద నీట మునిగిన స్నానఘట్టాలు

భద్రాచలం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం నెమ్మదిగా తగ్గుతోంది. శనివారం రాత్రి ఏడు గంటలకు 47.5 అడుగులున్న గోదావరి నీటిమట్టం 9 గంటల పాటు నిలకడగా ఉంది. ఆదివారం తెల్లవారుజామున 5 గంటలకు 47.6 అడుగులకు పెరిగిన గోదావరి నీటిమట్టం.. ఆ తర్వాత 6 గంటలకు 47.7 అడుగులు, 8.54 నిమిషాలకు 48 అడుగులకు చేరడంతో రెండో ప్రమాద హెచ్చరికను భద్రాచలం సబ్‌కలెక్టరు మృణాల్ శ్రేష్ఠ జారీ చేశారు. ఈ సమయంలో భద్రాచలం వద్ద 11,44,645 క్యూసెక్కుల నీరు దిగువకు ప్రవహించింది. అనంతరం 3 గంటల పాటు నిలకడగా ఉన్న గోదావరి నీటిమట్టం మధ్యాహ్నం 1.05కి 47.9 అడుగులకు తగ్గడంతో రెండో ప్రమాద హెచ్చరికను సబ్‌కలెక్టర్ ఉపసంహరించారు. కాగా.. ప్రస్తుతం మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. అప్పటి నుంచి 8 గంటల వరకు గోదావరి నీటిమట్టం 47.9 అడుగుల వద్దే నిలకడగా కొనసాగుతోంది. 9 గంటల నుంచి 47.8 అడుగుల వద్ద ప్రవాహం కొనసాగుతోంది. మరోవైపు.. మొదటి ప్రమాద (మిగతా 6వ పేజీలో)

ఆయిల్ పాం కలెక్షన్ సెంటర్‌కు 'ఎఫ్' కోడ్ ఇవ్వాలి

- రైతులకు నష్టం చేసేలా ప్రైవేటు ఫ్యాక్టరీ ఏజెంట్ల తీరు
- విలేకరుల సమావేశంలో ఆయిల్‌పాం రైతులు

సత్తుపల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : సత్తుపల్లి మండలం పాకలగూడెంలో ఏర్పాటు చేసిన ఆయిల్‌పాం గెలల కలెక్షన్ సెంటర్‌కు అధికారులు వెంటనే ఎఫ్ కోడ్ కేటాయించాలని ఆయిల్ పాం రైతులు కోరారు. ఆదివారం సత్తుపల్లి మండలం కిష్టాపురంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రైతులు చీకటి చిట్టిరావు, పొన్నగంటి జోగారావు, హసావత్ కోటేశ్వరరావు, పి.శ్రీనివాసరావు, ఎన్.లోకేశ్వరరావు, దేవరపల్లి సాంబశివరావు మాట్లాడారు. ఎఫ్ కోడ్ కేటాయించే వరకూ ఎలాంటి అంతరాయం లేకుండా కలెక్షన్ సెంటర్‌ను కొనసాగించాలని కోరారు. సత్తుపల్లి మండలంలోని తుంబూరు, కిష్టాపురం, నారాయణపురం, గంగారం, పాకలగూడెం, తాళ్లమడ, వేంసూరు మండలం దుద్దెపూడి తదితర గ్రామాల రైతులకు పాకలగూడెం పరిసర ప్రాంతాల్లో ఆయిల్‌పాం తోటలు ఉన్నాయన్నారు. రైతులు పండించిన ఆయిల్ పాం గెలలను కలెక్షన్ సెంటర్‌కు తరలించడం ద్వారా ప్రయోజనం పొందుతున్నారని అన్నారు. గతంలో ఈ ప్రాంతం నుంచి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం అప్పారావుపేట ఆయిల్ పాం ఫ్యాక్టరీకి తరలించే వారమని, దీనివల్ల రైతులకు సమయం, కూలీల సమస్యలు ఎదురయ్యాయని అన్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో.. మూడు నెలల క్రితం ఆయిల్‌ఫెడ్ అధికారులు ఈ ప్రాంతంలో విచారించి రైతులకు కలెక్షన్ సెంటర్ అవసరాన్ని గుర్తించి ప్రతిపాదనలు పంపారని చెప్పారు. అప్పటి నుంచి రైతులు పాకలగూడెంలో ఏర్పాటు చేసిన కలెక్షన్ సెంటర్‌లో గెలలు విక్రయిస్తున్నారని చెప్పారు. రైతులు కలెక్షన్ సెంటర్‌కు తరలించిన పంటకు సంబంధించి వెంటనే నగదు జమ (మిగతా 6వ పేజీలో)



మీడియాతో మాట్లాడుతున్న ఆయిల్ పాం రైతులు

మున్నేరు కన్నీటికి ఏడాది

(5వ పేజీ తరువాయి)

వెళ్లే వరకు పునరావాస కేంద్రాల్లో అల్పాహారం, భోజనంతో పాటు ఇతర సహాయ కార్యక్రమాలు అందించారు. అనేక సేవా, స్వచ్ఛంద సంస్థలు, సంఘాలు భోజనాలు వండి బాధితులకు అందించారు. బురదను సైతం లెక్కచేయక ఇంటింటికీ వెళ్లి బాధితులను పునరావాస కేంద్రాలకు అధికారులు, ఉద్యోగులు చేర్చారు. ఖమ్మం నగరంలోని మున్నేరు పరివాహక ప్రాంతంలోని కాలనీలతో పాటు నగరంలోని ఇతర కాలనీలు కూడా వరద దిగ్బంధానికి గురై జలమయం అయ్యాయి. ఖమ్మం రూరల్, తిరుమలాయపాలెం, కూసుమంచి మండలంలోని అనేక గ్రామాలు, కాలనీలు కూడా మున్నేరు, ఆకేరు వరదల్లో ఇళ్లు మునిగి సర్వం కోల్పోయారు. తర్వాత వరద తగ్గి ఎండలు రావడంతో ఇళ్లు శుభ్రం చేసుకొని క్రమంగా నెల రోజులకే మళ్లీ బాధితులు తమ ఇళ్లకు వెళ్లి శుభ్రం చేసుకుని తిరిగి జీవనం సాగించారు. ఆర్థికంగా దెబ్బతిన్నా.. తమ రోజువారీ వృత్తులతో క్రమంగా కోలుకున్నారు. ఆనాటి వరద నష్టం రూ.729 కోట్లుగా అధికారులు గుర్తించారు. మళ్లీ మున్నేరుకు వరద వస్తున్నా.. అకాల వర్షాలతో వరద భయం ఉందంటే చాలు.. మళ్లీ ఆ కాళరాత్రి కళ్లల్లో కనిపిస్తుంది. ఇదే అదునుగా కొందరు మున్నేరుకు కొద్దిపాటి వరద వస్తున్నా మళ్లీ అదే వరద వస్తుందన్న తప్పుడు ప్రచారం బాధితులను భయపెడుతున్నాయి.


ఖమ్మం కాల్వొడ్డు మంచికంటి నగర్ నుంచి ఉధృతిగా ప్రవహిస్తున్న వరదనీరు(ఫైల్)

● మున్నేరుకు వరద వచ్చింది ఇలా..

సరిగ్గా ఏడాది క్రితం.. ఆగస్టు 31న.. మున్నేరు పరివాహకంలో వర్షాలు కురవడం మొదలయ్యాయి. గతంలో ఎన్నడూ చూడని విధంగా మున్నేరు, ఆకేరు ప్రాంతంలో 21.3సెం.మీ నుంచి 31.5 సెం.మీ. వరకు వర్షాలు పడ్డాయి. అలా క్రమంగా వరద ఉధృతి పెరిగింది. మున్నేరు వరద సుమారు 36 అడుగుల పై బడి 40 అడుగులకు చేరింది. ప్రకాష్‌నగర్ బ్రిడ్జిని కూడా ముంచెత్తింది. చినుకు ధాటికి జనం విలవిల్లాడారు. చిన్నచిన్న చినుకులే 22 సెంటీమీటర్ల వర్షంలా కురిసింది. ఇక దీంతో దారులన్నీ ఏరులయ్యాయి! ఊళ్లన్నీ చెరువులయ్యాయి.. ఆ ధాటికి మున్నేరుకు వరద పెరిగింది.. అదీ అంతా ఇంతా కాదు... క్షణాల్లోనే 36అడుగులకు పెరిగింది... అంతే కాలనీలన్నీ నిండా మునిగిపోయాయి... వరద ఉధృతికి రోడ్లు ముక్కలు చెక్కలయ్యాయి. ఇళ్లు... ఇళ్లల్లోని వస్తువులు... వాహనాలు.. కార్లు ..ఇలా క్షణాల్లో భీకర దృశ్యాలు సాక్షీకృతమయ్యాయి.. కాలనీలు జలమయం అయ్యాయి. అప్పటి వరకు కాళ్లతో నడిచిన జనం.. వీధుల్లోనే పడవలపై బిక్కుబిక్కుమంటూ తల దాచుకోవాల్సి వచ్చింది! మొత్తంగా ఆనాడు వరద ధాటికి రూ.729 కోట్లు నష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేశారు. మున్నేరు వరద ఖమ్మం నగరంలోని రామన్నపేట, బొక్కలగడ్డ, పద్మావతినగర్, వెంకటేశ్వరనగర్, మోతీనగర్, ధంసలాపురం, శ్రీనివాసనగర్, సుందరయ్యనగర్ ప్రాంతాలతో పాటు ఖమ్మం రూరల్ మండలంలోని కరుణగిరి, జలగంనగర్, నాయుడుపేట ప్రాంతాలను ముంచెత్తింది. ఇళ్లన్నీ తుడిచిపెట్టుకుపోయాయి. ఇళ్లలోకి భారీగా వరదనీరు చేరడంతో పాటు బురదమయం అయ్యాయి. సీసీ రోడ్లు, బీటీ రోడ్లు కొట్టుకుపోయాయి. కాలనీల్లో వెళ్లేందుకే వీల్లేకుండా బురద మేటలు వేసి వెళ్లేందుకు కూడా భయానక పరిస్థితులను మిగిల్చింది. గుంతలు పడిన రోడ్లు, కోసుకుపోయిన రోడ్లు, కూలిన ఇళ్లు.. ఇళ్లలో సామాన్లు వరద ధాటికి చెల్లాచెదురయ్యి కన్నీళ్లను మిగిల్చింది. అడుగు తీసి అడుగు వేయలేని దుస్థితిని మిగిల్చింది. అంతే కాదు.. ట్యాంకు బండ్ సమీపంలో లోతట్టు ప్రాంతాలు కూడా జలమయం అయ్యాయి. మమత రోడ్డు, వీఆర్ఆర్ రిసార్ట్స్ నాగార్జున ఫంక్షన్‌హాల్, కవిరాజ్‌నగర్, కోర్టు ప్రాంతాలు పాతకలెక్టరేట్ వెనుక, చెరువు బజారు ఇలా దాదాపు 5వేల ఇళ్లు లకారం ట్యాంక్‌బండ్ ప్రభావంతో నీటమునిగాయి. దీంతో జనం అతలాకుతలం అయ్యారు. ఖమ్మంలో ఇంతటి ఉపద్రవాన్ని ఎన్నడూ చూడని జనం ప్రకృతి ప్రకోపానికి బలయ్యారు.

● ప్రతీ ఇంటికి రూ. 16,500 సహాయం

వరద బాధితులకు ప్రభుత్వం తరఫున ఇంటికి రూ. 16,500 ఆర్థిక సహాయాన్ని ప్రకటించి అందించినప్పటికీ.. వాటిలో కొంత మంది బాధితులకు పరిహారం అందకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. సహాయం కోసం కొందరు బాధితులు కార్పొరేషన్ చుట్టూ తిరిగారు ఇందులో కొందరు నిజమైన బాధితులుండగా.. కొందరు ఇళ్లు నీరు పట్టినట్టు సహాయం కోసం తిరగడంతో వారికి నిలిపివేశారు.

● రిటైనింగ్ వాల్స్‌తో ఊరట

ఖమ్మం నగరంతో పాటు రూరల్ మండలాలకు మున్నేరు ముప్పు తప్పించేందుకు ప్రభుత్వం రూ. 690 కోట్లతో మున్నేరు రిటైనింగ్ వాల్స్ నిర్మాణాలను చేపట్టింది. మున్నేరు వరద అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఖమ్మం వచ్చి చూసి వెళ్లడం, జిల్లాకు చెందిన మంత్రులు పట్టుబట్టి గతంలో మంజూరైన మున్నేరు రిటైనింగ్ వాల్స్ టెండర్లు పూర్తిచేసి పనులు ప్రారంభించేశారు. మున్నేరుకు ఇరువైపులా 17 కిలోమీటర్ల మేర గోడలను నిర్మిస్తున్నారు. పనులు వచ్చే ఏడాదినాటికి పూర్తయ్యే అవకాశం ఉంది. పూర్తయితే ఖమ్మం నగరంతో పాటు ఖమ్మంరూరల్ మండలంలోని కాలనీలకు వరద ముప్పు శాశ్వతంగా తప్పనుంది.

మరోసారి అలాంటి పరిస్థితులు రాకుండా చర్యలు తీసుకోవాలి

వెంకటేశ్వర్లు (స్థానికుడు, బొక్కలగడ్డ)



భవిష్యత్‌లో వరద పోటెత్తకుండా అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలి. వచ్చిన వరద వచ్చినట్టే కిందకు వెళ్లేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఒకవేళ వరద వచ్చే అవకాశం ఉంటే.. ముందే హెచ్చరికలు జారీ చేసి స్థానికులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి. రిటైనింగ్ వాల్ నిర్మాణాన్ని వేగవంతం చేసి అందుబాటులోకి తీసుకురావాలి. వరద ప్రభావిత ప్రాంతాలలో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలను నిరంతరం పర్యవేక్షించాలి.


కాల్వొడ్డు కూరగాయల మార్కెట్ నీటమునిగిన దృశ్యం


కాల్వొడ్డులో సిగ్నళ్ల వద్దకు చేరిన మున్నేరు వరద నీరు ఇలా...!

నిద్రలేచే సరికి పాదాలు నిండా నీళ్లున్నాయి!

షేక్ జాన్‌బీ, మోతీనగర్



గతేడాది ఆగస్టు 31 రాత్రి 3గంటల సమయంలో మా పక్కింటి వాళ్లు కింద పడుకుంటే వరదనీళ్లు వచ్చి తడవడంతో మమ్మల్ని లేపారు. మంచంపై నుంచి లేచి కాళ్లు కింద పెట్టేసరికే పాదాలు మునిగేలా ఇంట్లోకి నీళ్లొచ్చాయి. భయంతో వణికిపోయాం.. అప్పటికే మోతీనగర్‌లోకి వరదనీళ్లు వస్తున్నాయి.. మొదటిగా మా ఇంట్లోకే వచ్చాయి. ఉదయం 9 గంటలకు ఇళ్లంతా మునిగిపోయింది. సామాన్లు బియ్యం తడిచిపోయాయి. మూడు రోజులు ఇంటికి వెళ్లలేకపోయా. అప్పటికే జ్వరం వచ్చింది. నేను కోలుకునే సరికి 10 రోజులు పట్టింది. ఆ తర్వాత ఇల్లు బాగు చేసుకునేందుకు నెలరోజులు పట్టింది. కనీసం రూ. 2లక్షలు నష్టపోయాం. ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాం. మళ్లీ వరదలు వస్తాయని భయం వెంటాడుతోంది.

సామాన్లు ఏరుకొచ్చుకున్నాం..

ఎం.నందిని (డిగ్రీ విద్యార్థి, మోతీనగర్)



మా ఇల్లు ఏటి ఒడ్డునే ఉంది. గతేడాది వచ్చిన వరదకు ఇంట్లో సామాన్లన్నీ నీళ్ల ధాటికి కొట్టుకుపోయాయి. ఆ 10 రోజులు భయంగా గడిపాం. మూడు రోజులు పునరావాస కేంద్రంలో ఉన్నాం. అమ్మా కూలికి వెళ్తుంది. నాన్న సుతారి పని చేస్తాడు. మూడు రోజుల తర్వాత ఇంటికి వస్తే సామాన్లు ఏవీ ఇంట్లో లేవు. మొత్తం ఒక్కొక్కటిగా ఏరుకొచ్చాం. నా సర్టిఫికెట్లన్నీ కొట్టుకుపోయాయి. పాములు చెత్తాచెదారం వాసనతో నెలరోజులు గడపాల్సి వచ్చింది. గోడలన్నీ బురదమయం అయ్యాయి. వరదల తర్వాత ప్రభుత్వం ఇచ్చిన శిబిరంలో కొత్తగా సర్టిఫికెట్లు తీసుకున్నా. అంతటి వరద ఎప్పుడూ చూడలేదు. రెండు లక్షల వరకు నష్టపోయాం. ఆ వరద లు మళ్లీ రావద్దని కోరుకుంటున్నాం. మా ఇంటి వెనుక వైపుగా మున్నేరుకు రక్షణ గోడలు కడుతున్నారు. అవి పూర్తయితే ఈ బాధలు ఉండవేమో అనిపిస్తుంది.

10 రోజులు ఇంటికి రాలేకపోయాం...!

ఎస్.మహేశ్వరి, వెంకటేశ్వరనగర్



బంధువుల ఇంట్లో కార్యానికి వెళ్లాం. అంతే ఇంటికి వచ్చేలోపే వరద వచ్చింది. 10 రోజుల వరకు ఇంటికి వెళ్లలేకపోయాం. ఇంట్లో సామాన్లు వరదకు కొట్టుకుపోయాయి. ఆ తర్వాత ఇంటికి వచ్చాక తెలిసింది. ఇంట్లో ఒక్క సామాను కూడా లేదు. రేకుల కప్పు కూడా వరదకు కొట్టుకుపోయింది. సర్వం నాశనం అయ్యింది. నేలపై బురద, గోడలకు మట్టి తప్ప ఇంట్లో ఏమీ లేవు. బురద తొలగించడానికి నెలరోజులు పట్టింది. ఎఫ్‌సీఐ గోదాములో హమాలీగా పనిచేస్తుంటాడు నా భర్త. వరదకు పోయిన సామాన్లను ఇప్పటి వరకు కొనుక్కోలేక పోయాం. అలా కాలం వెళ్లదీసుకొస్తున్నాం. ఇద్దరు పిల్లలతో ఆనాడు పడిన కష్టం వర్ణనాతీతం. తాగడానికి నీళ్లు కూడా కొనుక్కోవాల్సి వచ్చింది. పగోళ్లకు కూడా ఇలాంటి కష్టాలు రావద్దని కోరుకుంటున్నా.

కళ్లెదుటే జల విలయం..

- భారీ వర్షాలతో జనజీవనం ఉక్కిరి బిక్కిరి..
- బతుకుదెరువు కోసం వచ్చి గల్లంతైన దంపతులు
- గతేడాది ఘటనను గుర్తు చేసుకుంటున్న స్థానికులు

కూసుమంచి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సరిగ్గా ఏడాది కిందట ఆగస్టు 31 అర్ధరాత్రి వచ్చిన భారీ వరదలకు పాలేరు జలాశయం ఉప్పొంగింది. 15గంటల పాటు ఏకధాటిగా కురిసిన జడివానతో రహదారులన్నీ ఏర్లను, చెరువులను తలపించాయి. భారీ వర్షాలతో ఉక్కిరి బిక్కిరైంది. పాలేరు జలాశయానికి ఎన్నడూ లేనంతగా లక్షా 60వేల క్యూసెక్కుల వరదనీరు వచ్చిచేరింది. ఖమ్మంజిల్లా నుంచే కాకుండా మహబూబాబాద్, వరంగల్, సూర్యాపేట జిల్లాల పరీవాహక ప్రాంతాలనుంచి వరద ఉధృతి పెరగడంతో 8గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. నాయకన్‌గూడెం, పాలేరు, కూసుమంచి, నానుతండ, నర్సింహులగూడెం, కొత్తూరు గ్రామాలు ఆనాడు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. రాత్రికి రాత్రి అధికారులు అందరినీ అప్రమత్తం చేశారు. కూసుమంచి మండలం మల్లాయిగూడెం వద్ద నాగార్జునసాగర్ ఎడమకాల్వ యూటీ వద్ద భారీ గండిపడింది. భారీవర్షాలకు పాలేరు ఉప్పొంగడంతో ఇద్దరు కొట్టుకుపోయారు. నాయకన్‌గూడెం వద్ద సిమెంట్ బ్రిక్స్ తయారు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న దంపతులు యాకూబ్, సైదాబీ పాలేరు వరద ప్రవాహానికి గల్లంతయ్యారు. వారి మృతదేహాలు మూడోరోజున లభ్యమయ్యాయి. వారి కుమారుడు ప్రవాహంలో కొట్టుకపోతుండగా పోలీసులు రక్షించారు. ఖమ్మం-సూర్యాపేట జాతీయ రహదారిపై నుంచి వరదపారడంతో కోతకు గురైంది. పంట పొలాలు దెబ్బతిన్నాయి. రెండు అడుగుల మందం వందలాది ఎకరాల వరిపొలాల్లో ఇసుకమేటలకు వేసింది. ఏం జరుగుతుందోనని ప్రజలు బిక్కుబిక్కుమంటూ రోజులు గడిపారు. ముఖ్యవరద ప్రభావిత ప్రాంతాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పరిశీలించి వెళ్లారు. ఆ రోజును తలుచుకుంటూ పాలేరు పరిసర గ్రామాల ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. ఈసంఘటనలు ఆసమయంలో నెలరోజులపాటు మండలప్రజలను దుఃఖసాగరంలో ముంచింది.


పాలేరు ఫాలింగ్ గేట్లపైనుంచి ప్రవహిస్తున్న వరద


వరదలో కొట్టుకుపోతున్న యువకుడిని రక్షిస్తున్న పోలీసులు

ఆయిల్ పాం కలెక్షన్ సెంటర్‌కు ఎఫ్ కోడ్ ఇవ్వాలి

(5వ పేజీ తరువాయి)

అవుతోందన్నారు. కలెక్షన్ సెంటర్ నుంచి మూడు కిలోమీటర్ల పరిధిలో ఉన్న వందలాది ఎకరాల్లోని ఆయిల్ పాం దిగుబడులు కోసి తరలించటం వల్ల రైతులకు, కూలీలకు సమయం ఆదా అవుతోందన్నారు. దీని ద్వారా రైతులకు కూలీల సమస్య కూడా తప్పిందన్నారు. ఇప్పటి వరకూ వందలాది మంది రైతులకు కలెక్షన్ సెంటర్ వల్ల ప్రయోజనం కలిగిందని, ప్రతీ ఒక్కరికి నగదు కూడా వెంటనే జమ అయ్యిందన్నారు. కలెక్షన్ సెంటర్ వల్ల రైతులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. సరిహద్దులోని పక్క రాష్ట్రంలో ప్రైవేటు కంపెనీలకు చెందిన ఏజెంట్లు స్థానికంగా కొందరిని రెచ్చగొట్టి కలెక్షన్ సెంటర్ల వల్ల రైతులకు నష్టం జరుగుతోందని, ఆయిల్‌పాం బిల్లులు మొత్తం ఒకరి ఖాతాలోకే వెళ్లిపోతున్నాయని దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. గతంలో సరిహద్దులోని ఆయిల్‌పాం తోటల్లో దిగుబడులను రైతులను మభ్యపెట్టి ప్రైవేటు ఫ్యాక్టరీలకు తరలించుకొని పోయిన సంఘటనలు ఉన్నాయన్నారు. ప్రస్తుతం కలెక్షన్ సెంటర్ ఏర్పాటు కావటం, దీని వల్ల రైతులకు ప్రయోజనం కలుగుతుండడంతో.. కొందరు వ్యక్తులు ప్రైవేటు కంపెనీలతో చేతులు కలిపి కేవలం ఎఫ్ కోడ్ రాలేదనే సాకు చూపి లేనిపోని ఆరోపణలు చేస్తూ రైతులకు నష్టం కలిగించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. రైతులకు మేలు జరుగుతున్న కలెక్షన్ సెంటర్‌కు అధికారులు వెంటనే ఎఫ్ కోడ్ కేటాయించాలని, అప్పటి వరకూ కలెక్షన్ సెంటర్ ద్వారానే ఆయిల్‌పాం గెలలు కొనుగోలు చేయాలని వారు కోరారు.

తేలు కాటుకు యువకుడి మృతి

తిరుమలాయపాలెం, ఆగస్టు31 (ఆంధ్రజ్యోతి): తేలుకాటుకు గురై చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందిన సంఘటన మండలంలో జరిగింది. మండలంలోని అజ్మీరతండా పంచాయతీ శివారు రాకాసితండాకు చెందిన పోతుగంటి రామయ్యకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. వారిలో చిన్న కుమారుడు విజయ్‌కుమార్ (26) కష్టపడి చదివి రైల్వేఉద్యోగం సాధించి విధుల్లో చేరేందుకు సిద్ధమవుతున్న తరుణంలో రెండు రోజుల క్రితం తమ కుటుంబానికి ఉన్న వ్యవసాయ పొలంలో వరినారు కట్టించి ఉద్యోగ విధుల్లో చేరాలనుకున్నాడు. ఇంతలో విజయ్‌కుమార్ తేలుకాటుకు గురయ్యాడు. అతని పరిస్థితి విషమంగా ఉండడంతో ఖమ్మంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్సపొందుతూ మృతిచెందాడు. గతేడాది రాకాసితండాలో వచ్చిన భారీ వరదలతో పొలం మొత్తం రాళ్లతో నిండిపోగా రాళ్లను తొలిగించే క్రమంలో తేలుకాటుకు గురయ్యాడు. కాగా విజయ్‌కుమార్ సోదరుడు కూడా కొన్నేళ్ల క్రితం మృత్యువాత పడ్డాడు. ఇద్దరు కుమారులు మృతిచెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తు చేసుకోండి : డీఈవో

కొత్తగూడెం ఎడ్యుకేషన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): గురుపూజోత్సవం సందర్భంగా ఈ నెల 5వ తేదీ జరుగనున్న గురుపూజోత్సవ వేడుకల్లో జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించడం జరుగుతుందని డీఈవో ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పురస్కారం కోసం జిల్లాలో పనిచేస్తున్న ప్రభుత్వ, లోక్‌బాడీ ఉపాధ్యాయని, ఉపాధ్యాయులు సెప్టెంబరు 3లోగా జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో తమ దరఖాస్తులను సమర్పించాలని తెలిపారు. గత రెండు సంవత్సరాలుగా వారు చేపట్టిన వినూత్న కార్యక్రమాలు, పాఠశాలలో జరిపిన ప్రగతి ఆధారంగా అవార్డులు నిర్ణయించడం జరుగుతుందని ఆయన సూచించారు.

రామాలయంలో అంతర్గత బదిలీలు

భద్రాచలం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) సీతారామచంద్రస్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం పలువురు ఉద్యోగులకు అంతర్గత బదిలీలు జరిగాయి. భద్రాద్రి దేవస్థానం నూతన ఈవోగా కె.దామోదర్‌రావు బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలి విడతలో నలుగురు ఉద్యోగులకు అంతర్గత బదిలీలు నిర్వహించారు. ఎస్.కనకచెమ్మరాజు ప్రసాదాల తయారీ విభాగం నుంచి శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీచేశారు. క్యాషియర్‌గా పనిచేస్తున్న బి.కె.వి.వి.ఎస్.శ్రీనివాసరావును ప్రసాదాల తయారీ విభాగంకు బదిలీచేశారు. ఎస్టాబ్లిష్మెంట్ విభాగాన్ని చూస్తున్న టి.రాకేష్‌కు క్యాషియర్ విభాగం బాధ్యులుగా అదనపు బాధ్యతలు అప్పగించారు. పోస్ట్ ఆడిట్, వార్షిక ఉత్సవాలు, మేజర్ ఫెస్టివల్స్ విభాగాలలో బాధ్యతలు నిర్వహిస్తున్న కె.కుమారికి సీఆర్‌వో ఇన్‌చార్జ్, ట్రస్టుబోర్డ్, ఆర్టీఐ, ఫైల్స్ కరస్పాండెంట్స్ బాధ్యతలను అదనంగా అప్పగించారు.

యూరియా దొరక్క..

(5వ పేజీ తరువాయి)

పడరాని పాట్లుపడుతున్నారు. ఈ పంటలు చేతికందాలంటే బూస్టర్ డోస్ వేయాలని లేకుంటే పంటలు పెరుగుదల లేక దిగుబడులు తగ్గి పంటల నాణ్యత దెబ్బతింటుందని రైతులు చెబుతున్నారు. ప్రణాళిక బద్ధంగా ఎరువుల సరఫరాలో ప్రభుత్వం ఇప్పటికే చేతులు ఎత్తేసింది. బఫర్ స్టాక్ నిర్వహణలో మార్క్‌ఫెడ్ విఫలమైందని ఆరోపణలు ఉన్నాయి. ఈ యేడు ఈ నెల 23వరకు ఖరీఫ్ సీజన్‌లో 4,68,909లక్షల ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేశారు. భూ విస్తీర్ణం, పంటల సాగును బట్టి నెలవారీగా అధికారులు ఎరువులకు సంబంధించిన ప్రతిపాదనలు పంపుతున్నారు. కేంద్ర ప్రభుత్వం విక్రయదారులకు ఈ-పాస్ యంత్రాలు ఇచ్చింది. ఎరువులు కావాల్సిన వారు ఆధార్‌కార్డు తీసుకువెళ్లి వేలి ముద్ర వేస్తేనే ఇస్తారు. ఒక్కో రైతుకు 2,3 సంచులు పరిమితం చేశారు. రైతులు కాని వారంతా ఆధార్ కార్డులతో ఎరువులు తీసుకెళ్లి గ్రామాల్లో అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వం బోనస్ ఇవ్వడంతో వరిసాగు పెరిగి యూరియా అవసరం పెరిగింది. సాగు విస్తీర్ణం ప్రకారం పంటలకు వినియోగం అంచనాకు మించి యూరియా వచ్చిందని అధికారులు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో మాత్రం యూరియా కోసం రైతులు బారులు తీరుతున్నారు. వచ్చిన యూరియా ఎటుపోతుందో ప్రశ్నార్థకంగా మారింది. పంపిణీ చేస్తున్న యూరియాను అధికారులు ఎవరూ పర్యవేక్షించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. రైతులకు ఎంత యూరియా ఇచ్చారనే లెక్కలు ఎవరి వద్ద లేకపోగా.. కొందరు కృత్రిమ కొరతతో అన్నదాతల ఆశలను సొమ్ము చేసుకుంటున్నారు.

డీలర్లు, పరపతి సంఘాల అండతోనే..

జిల్లాలో వర్షాలు కురిసే సమయానికి యూరియా కొరత కర్షకులను వేధిస్తోంది. పశుగ్రాసం సాగుకు యూరియా వినియోగానికి తోడు జిల్లాలో కొందరు హోల్‌సేల్, రిటైల్ డీలర్ల అవినీతి, సహకార పరపతి సంఘాల అక్రమాలతో కొరత ఏర్పడుతుందనే ఆరోపణలు ఉన్నాయి. ఏ ఏ మండలాల్లో ఏ పంటలు సాగు అవుతున్నాయి..? ఎంత యూరియా అవసరం ఉంటుంది..? ప్రస్తుతం రైతు సేవా కేంద్రాల్లో, ప్రైవేట్ డీలర్ల వద్ద ఎంత నిల్వలు ఉన్నాయి..? తదితర అంశాలను పర్యవేక్షించే అధికారులే కరువయ్యారు. జిల్లాలో యూరియా వేసుకునేందుకు వాతావరణం అనుకూలంగా ఉండటంతో రైతులు సహకార సొసైటీలు, లైసెన్స్ కలిగిన ప్రైవేట్ డీలర్ల వద్దకు పెద్ద మొత్తంలో చేరుకుంటున్నారు. కొందరు వ్యాపారులు తమకు కేటాయించిన స్టాకును తమకు తెలిసిన పెద్ద రైతులకు ఇస్తున్నారు. తమ వరకు వస్తుందో రాదో అన్న ఆందోళనతో తోపులాటకు దిగుతున్నారు. ఫలితంగా యూరియా దొరకని చిన్న, సన్నకారు, కౌలు రైతులు రోడ్ల పైకి వస్తున్నారు.

జిల్లాలో యూరియా కొరత లేదు


బాబురావు (జిల్లా వ్యవసాయ అధికారి)

జిల్లాలో యూరియా కొరత లేదు. జిల్లాకు వచ్చిన యూరియాను రైతులు అవసరం మేరకు సహకార కేంద్రాలకు పంపుతున్నాం. వర్షాలు కురవడంతో రైతులు అందరూ ఒకేసారి రావడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. జిల్లాలో యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా నిల్వలు కూడా ఉన్నాయి. అంతే గానీ జిల్లాలో ఎలాంటి యూరియా కొరత లేదు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారమయ్యే వరకు సంఘటిత పోరాటం

టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు

ఖమ్మం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): రాష్ట్రంలో ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం దశలవారీగా పోరాటం సాగుతుందని టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లో జరిగిన ఖమ్మంజిల్లా టీజీవో అధ్యక్షుడు, సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ కస్తాల సత్యనారాయణ పదవీ విరమణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఉద్యోగుల సమస్యల సాధన పోరాటంలో ఖమ్మంజిల్లా ఉద్యోగులు, అధికారులు ఎప్పుడు ముందుంటారని, సోమవారం దేశవ్యాప్తంగా జరిగే పెన్షనర్ల విద్రోహదినం అన్నిరాష్ట్రాల్లో జరుగుతుందని, దీనిని విజయవంతం చేయాలని విజ్ఞప్తిచేశారు. సమస్త ఉద్యోగులు పెన్షన్ పథకం కోసం 206 ఉద్యోగసంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యమిస్తున్నాయని, గెజిటెడ్ ఆఫీసర్ల నుంచి ఆశావర్కర్ల వరకు సమస్యల పరిష్కారానికి సంఘటితంగా ఏ ఆందోళనకైనా సిద్ధమని తెలిపారు. ప్రభుత్వం చేసే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా తీసుకెళ్లేందుకు ముందుంటామన్నారు. ప్రభుత్వానికి అన్నివిధాల సహకరిస్తూనే సమస్యల పరిష్కారం అయ్యేందుకు ఆందోళనలు చేపడతామన్నారు. ఉద్యోగులకు రావాల్సిన 10వేల కోట్ల పెండింగ్ బిల్లులు రాబట్టుకునే విషయంలో వెనక్కి తగ్గేదిలేదన్నారు. మొదటి విడతగా రూ.700 కోట్లకు అంగీకరించడం జరిగిందని, అయినప్పటికీ చెల్లించలేదని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు, అధికారుల బిల్లులతో పాటు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల బిల్లులు సైతం చెల్లించాల్సిందేనని, ఈ సమస్యలపై ఈనెల 2న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన చర్చలు జరుగుతాయని తెలిపారు. గత ప్రభుత్వంలో ఉద్యోగులకు సంబంధించిన బిల్లులను పెండింగ్‌లో పెట్టిందని గుర్తుచేశారు. డీఏలను కూడా మంజూరు చేయాలని సూచించారు. ఉద్యోగుల సమ్యలపై ప్రభుత్వానికి రాతపూర్వకంగా నోటీసులు ఇవ్వడం జరిగిందని, గత ప్రభుత్వంలో ఉద్యోగ సంఘాలు సమస్యలు చెప్పుకోలేని పరిస్థితి నెలకొందన్నారు. ఉద్యోగులకు రావాల్సిన డీఏలలో ఒక డీఏ మాత్రమే ఇచ్చారని, మిగలిన డీఏలు కూడా మంజూరుకావాల్సి ఉందన్నారు. 317 జీవోను రాజ్యాంగ బద్ధంగా సవరించాల్సి ఉందని అసెంబ్లీ తీర్మానం చేసి పార్లమెంట్‌లో ఆమోదంచి సవరించాలని సూచించారు. ఖమ్మం టీజీవో అధ్యక్షుడిగా జిల్లా సోషల్ వెల్ఫేర్ అధికారిగా కస్తాల సత్యనారాయణ సేవలు ఉద్యోగ వరంగా, ఉద్యోగ సంఘ నాయకుడిగా ఘనంగా పనిచేశారని ఆయన సేవలు స్ఫూర్తిదాయకమని ప్రశంసించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏలూరి శ్రీనివాసరావు

రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనం

ఖమ్మం బైపాస్‌రోడ్, ఆగస్టు31 (ఆంధ్రజ్యోతి): బిహార్ ఎన్నికల ర్యాలీలో కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ ప్రధాని నరేంద్రమోదీ తల్లి హీరాబాయి మోదీపై అవమానకర వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ఖమ్మంలోని ఆర్‌అండ్‌బీ గెస్టుహౌజ్ నుంచి జడ్పీసెంటర్ వరకు చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశానికి అందించిన నాయకత్వం ప్రపంచమంతా ప్రశంసిస్తుంటే, వారి తల్లిని రాహుల్‌గాంధీ అవమానించడం క్షమించరాని నేరం అన్నారు. రాహుల్ బిహార్ ఎన్నికల సభలో ప్రధాని తల్లిని అవమానించేలా మాట్లాడారన్నారు. తక్షణమే రాహుల్‌గాంధీ క్షమాపణ చెప్పాలని లేదంటే తీవ్ర ఆందోళన చేపడతామన్నారు. అనంతరం పలువురు బీజేపీ నాయకులను పోలీసులు అరెస్టుచేసి టుటౌన్ పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సన్నే ఉదయ్‌ప్రతాప్, గెంటేల విద్యాసాగర్, మందడపు సుబ్బారావు, అల్లిక అంజయ్య, గుత్తా వెంకటేశ్వర్లు, సుదర్శన్‌మిశ్రా, దొడ్డా అరుణ, పమ్మి అనిత, వీరవెల్లి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

స్వల్పంగా పెరిగి.. ఆ పై తగ్గుముఖం!

(5వ పేజీ తరువాయి)

హెచ్చరిక కొనసాగుతుండటంతో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉంది. భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ ఎప్పటికప్పుడు వరద సమాచారం తెలుసుకొని అందుకు అనుగుణంగా చర్యలు చేపడుతున్నారు.

మూడో రోజూ కొనసాగుతున్న మొదటి ప్రమాద హెచ్చరిక

భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం మూడు రోజుల క్రితం 43 అడుగులకు చేరడంతో మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. ఈ క్రమంలో గోదావరి నిలకడగా ఉండి స్వల్పంగా పెరిగి తగ్గుముఖం పట్టింది. కాగా మళ్లీ 47.9 వద్దే నిలకడగా ఉండటంతో స్నానఘట్టాల ప్రాంతంలోకి ఎవరినీ అనుమతించడం లేదు. ఇదిలా ఉండగా గోదావరి స్నానఘట్టాలు పూర్తిగా నీట మునగగా.. దేవస్థానం కల్యాణ కట్ట కింది భాగం సైతం గత మూడు రోజులుగా నీట మునిగే ఉంది. అదే విధంగా దుమ్ముగూడెం మండలం పర్ణశాలలోని సీతమ్మ నార చీరల ప్రాంతం నీట మునిగే ఉంది. తూరుబాక వద్ద డైవర్షన్‌రోడ్డుతో పాటు బైరాగులపాడు సున్నంబట్టి మధ్య రహదారిపై వరద నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి.

విద్యాశాఖలో ఖాళీ పోస్టుల సర్దుబాటు సందడి

(5వ పేజీ తరువాయి)

ద్వారా భర్తీ చేయాల్సి ఉంటుంది. స్కూల్ అసిస్టెంట్స్, ఎస్‌జీటీ పోస్టుల ఖాళీలను గుర్తించే ప్రక్రియలో విద్యాశాఖ కసరత్తు ప్రారంభించింది. ఇటీవల పదోన్నతులపై సుదూర ప్రాంతాలకు వెళ్లిన స్కూల్ అసిస్టెంట్స్ పట్టణాలకు దగ్గరకు రావడం కోసం ఇప్పటికే పైరవీలు ప్రారంభించారు. ఈసారి ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఎక్కువగా ఖాళీలు ఉన్నాయి. దూరంగా పని చేసే ఎస్‌జీటీలు సమీప ప్రాంతాలక రావడానికి ఇప్పటికే ప్రజాప్రతినిధుల నుంచి పైరవీలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. వాస్తవానికి జీవో నెంబర్ 25 ప్రకారం అంటే విద్యార్థులు, ఉపాధ్యాయులు సంఖ్య నిష్పత్తి ప్రకారం జిల్లాలో 800కి పైగా స్కూల్ అసిస్టెంట్స్ మిగులుగా ఉన్నట్లు తెలుస్తోంది. స్కూల్ అసిస్టెంట్స్‌లో మొత్తం 267మంది ఖాళీ ఉండగా.. వీటిలో 70శాతం పదోన్నతుల ద్వారా భర్తీచేశారు.మిగిలిన 80శాతం ఖాళీలు డైరెక్ట్ రిక్రుట్‌మెంట్ కోసం ఉంచారు. తాత్కాలిక సర్దుబాటులో భాగంగా ఈ ఖాళీలు ఉంచా రు. తాత్కాలికంగా సర్దుబాటులో భాగంగా ఈ ఖాళీలు కూడా భర్తీ చేస్తారని తెలుస్తోంది. ప్రస్తుతం జిల్లాలో 800లకు పైగా మిగులు ఉపాధ్యాయులు ఉన్నట్లు తెలుస్తోంది. కాగా.. సుదూర ప్రాంతాల పాఠశాలల్లో ఉన్న ఖాళీలను మొదట భర్తీ చేయాలని, విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఉపాధ్యాయ పోస్టులు నింపాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

కలుపుమందు నీళ్లు తాగి 14 మందికి అస్వస్థత

కొత్తగూడెం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

టేకులపల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కలుపుమందు కలిపిన బిందెలోని నీళ్లుతాగి 14 మంది కూలీలు అస్వస్థతకు గురైన సంఘటన టేకులపల్లి మండల పరిధిలోని తొమ్మిదవ మైలుతండాలో చోటుచేసుకొంది. పోలీసుల కథనం ప్రకారం తొమ్మిదవ మైలతండాకు చెందిన జాటోతు రాజు అనే రైతు ఆదివారం మిర్చితోటలో వ్యయసాయ కూలీలు కలుపు మందు కలిపిన బిందెలోనే మంచినీళ్ళు తీసుకొచ్చి తీగారు. కొంత సమయం తర్వాత నీరుతాగిన కూలీలు వాంతులు చేసుకోవడంతో ముందుగా సులానగర్ పీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన చికిత్సల కోసం అక్కడి నుంచి కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్సలు అందిస్తున్నారు. ఈ మేరకు సమాచారం అందుకున్న టేకులపల్లి పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.



సంచార జాతుల విముక్తి దినోత్సవంలో పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న లక్ష్మణ్

కనుమరుగవుతున్న సంచార జాతుల కళలు

» ప్రధాని మోదీ ఆదేశాలతో విముక్తి దినోత్సవం: కె.లక్ష్మణ్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సంచార జాతుల విన్యాసాలు, హరి కథలు, బుర్ర కథలు వంటి సంప్రదాయ కళలు అంతరించిపోవడం దురదృష్టకరమని బీజేపీ రాజ్యసభ సభ్యుడు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. ఆదివారం ఉస్మానియా యూనివర్సిటీ దూర విద్య కేంద్రంలో నిర్వహించిన సంచార జాతుల విముక్తి దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడారు. ప్రధాన మోదీ సంచార జాతుల విముక్తి దినోత్సవ ప్రాముఖ్యతను గుర్తించి, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అధికారికంగా ఈ వేడుకను జరపాలని ఆదేశించారని తెలిపారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్, ఢిల్లీ, హరియాణా, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలో ఈ కార్యక్రమాన్ని అధికారికంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. తాను 1999లో మొదటిసారి శాసన సభ్యుడిగా ఎన్నికైనప్పుడు అసెంబ్లీలో సంచార జాతుల సమస్యలను ప్రస్తావించానని గుర్తు చేశారు. ఆ తర్వాతే అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు సంఘాలతో మాట్లాడి కులాల పేర్లను అధికారికంగా మార్చారని పేర్కొన్నారు. ఇటీవల తెలంగాణలో కాంగ్రెస్ చేసిన కుల గణన ఓటు బ్యాంకు దృష్టితో జరిగిందని, అందులో బీసీలకు, అణగారిన వర్గాలకు న్యాయం జరగలేదన్నారు. కులాల వారీ లెక్కలు అధికారికంగా రావాలంటే కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో జరిగే గణన ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. సంచార జాతుల్లో కులాల లెక్కలు అధికారికంగా తేలితే బడ్జెట్ కేటాయింపులు, అభివృద్ధి ప్రణాళికలను స్పష్టంగా అమలు చేయవచ్చని లక్ష్మణ్ అన్నారు.

వివరణ ఇచ్చేందుకు 10 రోజుల గడువు ఇవ్వండి

» స్పీకర్‌ను కలిసి కోరిన కడియం, అరికెపూడి, దానం

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ ఫిర్యాదు మేరకు జారీ చేసిన నోటీసులపై విచారణకు హాజరై వివరణ ఇచ్చేందుకు తమకు పది రోజుల గడువు ఇవ్వాలంటూ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, అరికెపూడి గాంధీ, దానం నాగేందర్ కోరారు. అసెంబ్లీలోని స్పీకర్ కార్యాలయంలో ఆదివారం ఆయన్ను కలిసిన ముగ్గురు ఎమ్మెల్యేలు ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. మిగిలిన ఎమ్మెల్యేలూ స్పీకర్‌ను కలిసి గడువు కోరనున్నట్లు తెలుస్తోంది. అనంతరం అసెంబ్లీ లాబీల్లో కడియం, అరికెపూడి గాంధీ మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడుతూ.. తాము వివరణ ఇచ్చేందుకు స్పీకర్‌ను పది రోజులు గడువు ఇవ్వాలని కోరినట్లు వెల్లడించారు. కాగా.. బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచి కాంగ్రెస్‌లోకి మారిన పది మంది ఎమ్మెల్యేలపైన అనర్హత వేటు వేయాలంటూ గతంలోనే స్పీకర్‌కు ఫిర్యాదు ఇచ్చిన బీఆర్ఎస్.. ఈ అంశంపైన సుప్రీం కోర్టునూ ఆశ్రయించగా.. మూడు నెలల్లోగా స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని సూచించింది. ఇందులో భాగంగానే పది మంది ఎమ్మెల్యేలకూ స్పీకర్ కార్యాలయం నోటీసులు జారీ చేసింది.

ఆర్ఎఫ్‌సీఎల్ లో లీకేజీలకు ఎవరిది బాధ్యత..?

» రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రామగుండం ఎరువుల కర్మాగారం(ఆర్ఎఫ్‌సీఎల్)లో అమ్మోనియా పైప్‌లైన్ వరుస లీకేజీలకు బాధ్యత ఎవరిదని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ప్రశ్నించారు. రామగుండంలో ఎరువుల కర్మాగారం నిర్మిస్తే రాష్ట్ర రైతాంగానికి యూరియా సకాలంలో అందుతుందని యూపీఏ ప్రభుత్వం ప్లాంట్ నిర్మాణానికి అనుమతినిచ్చిందని తెలిపారు. ప్లాంటు అవసరాలకు మిషన్ భగీరథ నీరు ఇస్తున్నామని, ఉత్పత్తిలో 50శాతం యూరియాను తెలంగాణకు కేటాయించాల్సిందేనని డిమాండ్ చేశారు. ఆర్ఎఫ్‌సీఎల్ నుంచే ఈ సీజన్లో రాష్ట్రానికి రావాల్సిన 1.2లక్షల టన్నుల యూరియాను తగ్గించారన్నారు. ప్లాంట్‌లో నిర్మాణలోపాలు, అధికారుల నిర్లక్ష్యంపై సీబీఐతో విచారణ జరిపించాలని కేంద్రానికి లేఖ రాస్తానన్నారు.

కేటీఆర్.. ఓ మానసిక రోగి

ఉపరాష్ట్రపతి ఎన్నికకు యూరియాకు ఏం సంబంధం?.. ఎన్డీఏ అభ్యర్థికే ఓటేస్తామని చెప్పొచ్చుగా?

» నాపై 181 కేసులు బనాయించారు
» ఇల్లు కూల్చేశారు..నన్ను కిడ్నాప్ చేశారు
» చంద్రబాబుతో సంప్రదింపులు అబద్ధం
» 2029లో రాహుల్ గాంధీనే ప్రధాని
» 'ఇండియా టుడే' ఇంటర్వ్యూలో రేవంత్



న్యూఢిల్లీ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఒక మానసిక రోగి అని, యూరియా ఇస్తేనే ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో మద్దతు ఇస్తామనడం పిచ్చికి పరాకాష్ట అని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. అనవసరంగా ఇలాంటి నాటకాలు ఎందుకని, ఎన్డీఏ అభ్యర్థికి మద్దతిస్తామని కేటీఆర్ చెప్పవచ్చు కదాని పేర్కొన్నారు. యూరియా ఇచ్చేది కేంద్రమని, అలాంటప్పుడు యూరియా ఇస్తేనే ఇండి కూటమి అభ్యర్థికి మద్దతు ఇస్తామని ఎలా అంటున్నారని నిలదీశారు. గత ప్రభుత్వ హయాంలో తనపై అక్రమంగా 181 కేసులు బనాయించారని, ఆ కేసులే తనకు మెడల్స్ అని చెప్పారు. తెలుగు రాష్ట్రాల తోపాటు తమిళనాడు, కర్ణాటక, గుజరాత్.. ఇలా అనేక రాష్ట్రాల్లో తెలుగు మాట్లాడే ఎంపీలు ఉన్నారని, వారంతా కలసి సుదర్శన్‌రెడ్డిని ఉప రాష్ట్రపతిగా గెలిపించాలని పిలుపునిచ్చారు. ఇటీవల సీఎం రేవంత్‌ను ఇండియా టుడే ప్రత్యేకంగా ఇంటర్వ్యూ చేసింది. అందులో రేవంత్ ఆసక్తికర అంశాలను వెల్లడించారు.

బీఆర్ఎస్ పతనావస్థకు చేరింది..

గత పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అవయవ దానం చేసి బీజేపీని 8 సీట్లలో గెలిపించిందని రేవంత్ చెప్పారు. బీఆర్ఎస్ పుట్టినప్పటి నుంచి ఒక్క పార్లమెంట్ సీటైనా గెలిచిందని, ఇప్పుడు ఘోరంగా పతనావస్థకు చేరిందన్నారు. కేసీఆర్, హరీశ్‌రావు ప్రాతినిధ్యం వహిస్తున్న మెదక్‌లోనూ బీజేపీనే గెలిచిందన్నారు.

కేసులతో ఖతం చేయాలని చూశారు..

ప్రజల కోసం ప్రశ్నించిన ప్రతిసారి తనపై కేసులు పెట్టారని, అలా కేసులు పెట్టిన ప్రతిసారీ తనకు ప్రజల్లో మద్దతు పెరిగిందని రేవంత్ చెప్పారు. "నాపై 181 అక్రమ కేసులు పెట్టారు. ఎప్పటికైనా తన ప్రత్యర్థిని నేనేనని కేసీఆర్‌కు తెలుసు. అందుకే నన్ను హింసించేందుకు అన్ని ప్రయత్నాలు చేశారు. నాపై క్రిమినల్ కేసులు పెట్టి ఖతం చేయాలని చూశారు. ఎన్నికల సమయంలో నా ఇల్లు కూల్చేశారు. నన్ను కిడ్నాప్ చేశారు. మూడు నెలలకే ఎంపీగా గెలిచి ఢిల్లీకి వచ్చా. ఈ రోజు సీఎం అయ్యా" అని తెలిపారు.

రాజకీయ లబ్ధి కోసమే ఆ బిల్లు..

ఏదైనా కేసులో అరెస్టయి 30 రోజులకుపైగా జైలులో ఉన్న సీఎంలు, మంత్రులను పదవి నుంచి తప్పించే బిల్లును రేవంత్‌రెడ్డి తప్పుబట్టారు. రాజకీయంగా లబ్ధి పొందేందుకే దానిని తీసుకువచ్చారని ఆరోపించారు. "ప్రస్తుతం విపక్ష సీఎంలను టార్గెట్ చేసి కేసులు పెట్టడం చూస్తున్నాం. చిన్న అంశాల్లోనూ 30 రోజులు జైల్లో పెట్టొచ్చు. ఇదేమీ అంత పెద్ద విషయం కాదు. కొత్త బిల్లు చట్టంగా మారాక ఢిల్లీ ఆదేశాలను అమలు చేయకపోతే.. రాష్ట్రాల సీఎంలు ఎవరైనా పదవి వదులుకోవాల్సి వస్తుంది. ఈ అంశంపై యోగి ఆదిత్యనాథ్ సహా బీజేపీ సీఎంలే ఆందోళన చెందుతుంటే.. మిగతా సీఎంల పరిస్థితి ఏమిటి?" అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. అలాగని తానేమీ భయపడటం లేదని, తానెలాంటి తప్పూ చేయలేదని చెప్పారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ భావజాలానికి మద్దతివ్వకపోతే ఖతం చేయడమే వాళ్లకు తెలుసని ఆరోపించారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డిపై అమిత్‌షా వ్యాఖ్యలు అత్యంత దారుణమని మండిపడ్డారు.

చంద్రబాబుతో సంప్రదింపులు అవాస్తవం

2024లో కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వ ఏర్పాటు సమయంలో చంద్రబాబుతో తాను సంప్రదింపులు జరిపాననేది అవాస్తవ ప్రచారమని రేవంత్ స్పష్టం చేశారు. తానెప్పుడూ అటువంటి ప్రయత్నం చేయలేదన్నారు. అలాంటి రాజకీయాలను రాహుల్ గాంధీ విశ్వసించరని.. ఆయన అలా అనుకుంటే ఎప్పుడో ప్రధాని అయ్యేవారని చెప్పారు. చంద్రబాబు సీనియర్ రాజకీయవేత్త అని, రాజకీయ ఎత్తుగడల్లో ఆయనకు మించిన వారెవరూ లేరని పేర్కొన్నారు. చంద్రబాబును తాను గౌరవిస్తానని, కానీ తనకు పార్టీ, తెలంగాణ ప్రయోజనాలే ముఖ్యమని చెప్పారు. తన రాజకీయ అంచనాలు ఎప్పుడూ తప్పలేదని.. 2029లో రాహుల్ గాంధీనే ప్రధాని అని, కావాలంటే రాసిపెట్టుకోవాలని రేవంత్‌రెడ్డి చెప్పారు. ప్రధాని మోదీకి 2029 ఎక్స్‌పైరీ తేదీ అన్నారు. తాను బీజేపీలో పనిచేయలేదని, ఏబీవీపీలో పనిచేశానని.. బీజేపీ రాజకీయ పార్టీ అని, ఏబీవీపీ విద్యార్థి సంఘమని వివరించారు. తాను ఇప్పుడు కాంగ్రెస్ యూనివర్సిటీలో ఉన్నానని చెప్పారు.

ముందు ప్రేమించా..
సినిమా స్టైల్లో పెళ్లి జరిగింది..

తన ప్రేమ, వివాహంపై రేవంత్ ఆసక్తికర విషయాలు తెలిపారు. "నాది పెద్దలు చేసిన ప్రేమ వివాహం. ముందు నేను ప్రేమించాను. తర్వాత అది అరేంజ్ మ్యారేజ్‌గా మారింది. నా భార్య గీత ఢిల్లీలోని లేడీ శ్రీరాం కాలేజీలో చదువుకుంది. నేను తెలంగాణలో ప్రభుత్వ బడిలో చదువుకున్నాను. మా పరిచయం ఊహించని విధంగా జరిగింది. విజయవాడలో వాజ్‌పేయి సభ జరిగింది. కొందరితో కలసి నేను హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లాను. తిరిగి వచ్చే క్రమంలో గీత కుటుంబంతో కలిసి నాగార్జున సాగర్‌లో ఆగాం. అక్కడ గీతతో పరిచయం జరిగింది. అది ప్రేమగా మారింది. చివరికి సినిమా స్టైల్‌లో మా పెళ్లి జరిగింది. టైం దొరికితే మనవడితో ఎంజాయ్ చేస్తా" అని చెప్పారు.

ఒక్కసారి కూడా సిగరెట్ తాగలే..

జీవితంలో ఇప్పటివరకు ఒక్కసారి కూడా తాను సిగరెట్ తాగలేదని, అది తన విల్ పవర్ అని రేవంత్ చెప్పారు. తాను టీ కూడా తాగేవాడిని కాదని.. విద్యార్థి ఉద్యమాల్లోకి వచ్చిన తర్వాత హైదరాబాద్‌లో అలవాటైందని తెలిపారు. తాను ఫుట్‌బాల్ ఆటగాడినని, రాహుల్ గాంధీ దగ్గర సమయం దొరికినప్పుడల్లా.. ఫిట్‌నెస్‌పై సలహాలు, సూచనలు తీసుకుంటానని చెప్పారు.

ఓటుహక్కును కొల్లగొడుతున్న మోదీ

18 ఏళ్లకు ఓటుహక్కు కల్పించిన రాజీవ్‌గాంధీ.. దానిని కాపాడుకునేందుకు కలిసికట్టుగా పోరాడదాం

» 2029 రాహుల్ ప్రధాని అయ్యే సంవత్సరంగా చాటుదాం
» 21 ఏళ్లకు ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం కల్పించాలి : రేవంత్‌రెడ్డి
» కేరళలో పొంథువల్ మెరిట్ అవార్డుల ప్రదానోత్సవానికి హాజరు



విద్యార్థినికి పొంథువల్ మెరిట్ అవార్డు అందజేస్తున్న కేసీ వేణుగోపాల్, సీఎం రేవంత్

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ దేశంలో 18ఏళ్లు నిండిన ప్రతి పౌరుడికీ ఓటుహక్కు కల్పించారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రధాని మోదీ మాత్రం పౌరుల నుంచి ఓటుహక్కును కొల్లగొడుతున్నారని ఆరోపించారు. ప్రతి భారతీయుడి ఓటుహక్కును కాపాడి రాజ్యాంగాన్ని పరిరక్షించుకునేందుకు అందరం కలిసికట్టుగా పోరాడదామని పిలుపునిచ్చారు. 18ఏళ్లకు ఓటు హక్కు కల్పించిన వారికి, ఓటు హక్కును కొల్లగొట్టిన వారికి మధ్యే 2029 ఎన్నికలు జరగబోతున్నాయని తెలిపారు. 2029ని రాహుల్‌గాంధీని ప్రధానిని చేసే సంవత్సరంగా చాటుదామన్నారు. ఆదివారం కేరళలోని అలప్పుళలో ఏఐసీసీ ప్రధానకార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆధ్వర్యంలో జరిగిన పొంథువల్ (ఎంపీ) మెరిట్ అవార్డుల కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీ వేణుగోపాల్ ప్రారంభించిన ఈ అవార్డులు పది, పన్నెండు తరగతుల్లోని విద్యార్థుల్లో అత్యుత్తమ ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించడానికి ఎంతగానో దోహదపడుతున్నాయని తెలిపారు. తెలంగాణలో విద్యాభివృద్ధికి పెద్దఎత్తున కృషి చేస్తున్నామని, పేదలకు నాణ్యమైన విద్యనందించాలని సంకల్పించామని తెలిపారు. 55 రోజుల్లో 11,055 ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేశామన్నారు. రాష్ట్రంలో యంగ్‌ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మించబోతున్నామని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే వయసును 21ఏళ్లకు తగ్గిస్తూ రాజ్యాంగాన్ని సవరించుకోవాలన్నారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం పనిచేస్తున్న కాంగ్రెస్ కేవలం యువత శక్తిని నమ్ముకుని పోరాటం సాగిస్తోందన్నారు.

ఆగస్టులో రికార్డు వానలు

» సాధారణం కంటే 75% అధిక వర్ష పాతం

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆగస్టులో సాధారణం కంటే 75శాతం అధిక వర్షపాతం నమోదైంది. ఆగస్టులో సాధారణ వర్షపాతం 21.5సెం.మీ పడాల్సి ఉండగా.. 37.85 సెం.మీ కురిసింది. అంటే రోజుకు సగటున 1.2 సెం.మీ. వాన పడింది. గత ఏడాదితో సగటు పోల్చితే ఈసారి 80శాతం అధిక వర్షపాతం నమోదైంది. కాగా, ఈ ఏడాది జూన్ నుంచి ఆగస్టు వరకు సాధారణ వర్షపాతం 57.3సెం.మీ నమోదు కావాలి. అయితే ఇప్పటి వరకు 72 సెం.మీ వర్షం కురిసింది. అంటే 26శాతం అధిక వర్షపాతం నమోదైంది. ఇక రాష్ట్రవ్యాప్తంగా 621 మండలాలుండగా.. 136 చోట్ల అత్యధిక (60% ఎక్కువగా), 238 చోట్ల అధిక (20-59శాతం మధ్య), 221 మండలాల్లో సాధారణ వర్షపాతం, మరో 26 మండలాల్లో 20-60శాతం లోటు వర్షపాతం నమోదైంది. కామారెడ్డి జిల్లాలో అత్యధికంగా 104 సెం.మీ పడింది. కాగా, రాష్ట్రంలో నేడు, రేపు భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం జిల్లాల్లో అక్కడక్కడ భారీవర్షాలు కురుస్తాయని పేర్కొంది.

తెలంగాణ ఉద్యమకారుడి మృతి



ఎస్కే జానీమియ (ఫైల్)

ఆళ్లపల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఆళ్లపల్లి, గుండాల మండలాల్లోని మొదటిసారి టీఆర్ఎస్ జెండా స్థాపించిన తెలంగాణ ఉద్యమకారుడు ఎస్కే జానీమియ(75) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందాడు. ఉమ్మడి గుండాల మండలంలో జానీమియ మొదటిసారిగా టీఆర్ఎస్ జెండా ఎగురవేసి, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమంలో కీలకంగా పనిచేశారు. తెలంగాణ సాధించుకున్న అనంతరం ఆళ్లపల్లి మండలం కోసం అఖిలపక్షం ఆధ్వర్యంలో అనేక ఉద్యమాల్లో, రాస్తారోకోలో పాల్గొన్నారు. కాగా కొంతకాలంగా అనారోగ్యంతో మంచానికే పరిమితమైన ఆయన ఆదివారం మృతి చెందాడు. ఆయన మృతిపట్ల బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ప్రగాఢ సంతాపం తెలిపారు. గుండాల, ఆళ్లపల్లి మండలాల బీఆర్ఎస్‌తో పాటు కాంగ్రెస్, సీపీఐ, న్యూడెమోక్రసీ పార్టీల నాయకులు ఆయన మృతదేహానికి నివాళ్లు అర్పించారు.


రైలుకింద పడి వృద్ధురాలి ఆత్మహత్య

ఎర్రుపాలెం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎర్రుపాలెం రైల్వేస్టేషన్ సమీపంలో వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం జరిగింది. రైల్వేపోలీసుల తెలిపిన వివరాల ప్రకారం బనిగండ్లపాడు గ్రామానికి చెందిన మిద్దె మీరమ్మ(72) ఆర్థిక ఇబ్బందులు తాళలేక, మనస్తాపం చెందిన ఆమె ఎర్రుపాలెం రైల్వేస్టేషన్ సమీపంలో రైలుకింద పడి ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న రైల్వేపోలీసులు ఘటనాస్థలాన్ని సందర్శించి మృతురాలి బంధువులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం నిమిత్తం ఆర్కే ఫౌండేషన్ సహాయంతో మృతదేహాన్ని మధిర ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఖమ్మం ఎస్‌హెచ్‌వో కె.శ్రీనివాసరావు తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ దుర్మరణం

ఖమ్మంక్రైం, ఆగస్టు31 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ మహిళ మృతిచెందిన ఘటన ఆదివారం ఖమ్మం నగర శివారులో గోపాలపురం సమీపంలో జరిగింది. ఏన్కూరు మండలం కేసుపల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు తన భార్య లక్ష్మి(45)తో కలిసి ద్విచక్రవాహనంపై ఖమ్మం నుంచి స్వగ్రామానికి బయలుదేరారు. అయితే వెనుకనుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు దిచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో లక్ష్మి అక్కడికక్కడే మృతిచెందింది. విషయం తెలుసుకున్న ఖానాపురంహవేలి పోలీసులు సంఘటన స్థలంకు చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. భార్య మృతిచెందడంతో వెంకటేశ్వర్లు రోధిస్తున్న తీరు అందరినీ కలిచివేసింది.

పాము కాటుకు గురై వ్యక్తి మృతి



దీవిజ(ఫైల్)

పెనుబల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): పొలంలో మందు చల్లేందుకు వెళ్లి పాముకాటుకు గురై ఓవ్యక్తి మృతిచెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాలిలా.. పెనుబల్లి మండలం సిన్యాతండాకు చెందిన మాలోతు దీవిజ(44) ఆదివారం మధ్యాహ్నం తన వరి పొలంలో మందు చల్లేందుకు వెళ్లి పాము కాటుకు గురయ్యాడు. అది గమనించ కుండానే మొత్తం మందు చల్లి ఇంటికి తిరిగివస్తూ గంగదేవిపాడు లో స్పృహ తప్పిపడిపోయాడు. దీంతో అతడ్ని గ్రామస్థులు, బంధువులు కల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పాముకాటుకు గురైనట్లు గుర్తించి వైద్యసేవలందించారు. మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు.

ఆటో బోల్తా డ్రైవర్..

తిరుమలాయపాలెం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఆటో బోల్తాపడి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన శనివారం అర్ధరాత్రి జరిగింది. మహబూబాద్‌జిల్లా మరిపెడ మండలం రాంపురంకు చెందిన చిర్రా నరేష్(29) ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి రాంపురం నుంచి అత్తగారింటికి సుబ్లేడు వస్తుండగా వాహనాన్ని తప్పించబోయి ఆటో బోల్తాపడడంతో నరేష్ అక్కడిక్కకడే మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్

ఖమ్మం జిల్లా నుంచి మరో అంతర్జాతీయ క్రీడాకారుడిని చూడాలి

రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీల ముగింపు కార్యక్రమంలో సీపీ సునీల్‌దత్

ఖమ్మం స్పోర్ట్స్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ పేర్కొన్నారు. ఆదివారం ఖమ్మం నగరంలోని సర్దార్‌పటేల్ ఇండోర్ స్టేడియంలో అండర్-15 బాలుర, బాలికల రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. ప్రతి విద్యార్థి చిన్నతనం నుంచే క్రీడల్లో నైపుణ్యం పెంచుకోవాలన్నారు. క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు మానసిక పరిపక్వత ఉంటుందన్నారు. క్రీడా వసతులను ఉపయోగించుకొని పోటీల్లో రాణించాలని సూచించారు. ఖమ్మం జిల్లా నుంచి మరో అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడిని చూడాలని కోరికగా ఉందన్నారు. జిల్లాను స్పోర్ట్స్ హబ్‌గా తయారు చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ సందర్భంగా నగర మేయర్ పునకొల్లు నీరజ మాట్లాడుతూ నగరంలో క్రీడలను అభివృద్ధి చేసేందుకు, క్రీడా వసతులు కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. క్రీడాకారులు ఆటల్లో రాణించి జిల్లాకు ఖ్యాతిని తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఆమె అభినందనలు తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు, ఏసీపీ ఘంటా వెంకట్రావు, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు కర్నాటి వీరభద్రం, సెక్రెటరీ వింజనంపాటి చంద్రశేఖర్, అసోసియేషన్ బాధ్యులు జట్ల శ్రీను, రవిమారుత్, సిరిపురపు సుదర్శన్, కమర్తపు మురళీ, నల్లమోతు వెంకటేశ్వరరావు, యుగంధర్, కొంగర శ్రీనివాస్, దుద్దుకూరి సత్యనారాయణ, కొల్లి సత్యనారాయణ, శ్రీనివాసరెడ్డి, చావా వెంకటేశ్వరావు తదితరులు తదితరులు ఉన్నారు.

విజేతలు వీరే..

బాలికల సింగిల్స్ విభాగంలో: అన్వి విక్రమ్ గోవింద్(రంగారెడ్డి) ప్రథమస్థానం సాధించగా, పి.అన్య(మేడ్చల్) ద్వితియ, వై.శృతి (సంగారెడ్డి) తృతీయ స్థానాల్లో నిలిచారు.



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న సీపీ సునీల్‌దత్, మేయర్ పునకొల్లు నీరజ తదితరులు

బాలికల డబుల్స్ విభాగంలో : అక్షర(హైదరాబాద్), తనిష్క(మేడ్చల్) జోడీ ప్రథమ స్థానం సాధించగా, శ్రీవైభవి(నిజామాబాద్), అన్య(మేడ్చల్) జోడీ ద్వితీయ, కున్నిక, స్మితికారెడ్డి(మేడ్చల్)లు తృతీయస్థానాల్లో నిలిచారు.

బాలుర సింగిల్స్ విభాగంలో : శ్రీచేతన్‌శౌర్య(వరంగల్) ప్రథమ స్థానం సాధించగా, వి.చరణ్(మేడ్చల్) ద్వితీయ, చిన్మయ్ వాంఖడే (రంగారెడ్డి) తృతీయ స్థానాల్లో నిలిచారు.

బాలుర డబుల్స్ విభాగంలో:

వి.చరణ్(మేడ్చల్), చేతన్‌శౌర్య(మేడ్చల్)జోడీ ప్రథమ స్థానం సాధించగా, విదిత్‌రెడ్డి, రవికిశోర్‌పాల్(రంగారెడ్డి) జోడీ ద్వితీయ, చిన్మయ్‌వాంఖడే (రంగారెడ్డి), పి.క్రిషబ్(రంగారెడ్డి) జోడీ తృతీయ స్థానాల్లో నిలిచారు.


మిక్స్‌డ్‌డబుల్స్ విభాగంలో:

క్రిష్ణ(హైదరాబాద్), వైశృతి(సంగారెడ్డి) జోడీ ప్రథమస్థానం సాధించగా, వి.చరణ్(మేడ్చల్), తనిష్క(మేడ్చల్) జోడీ ద్వితీయ, అక్షితారెడ్డి (హైదరాబాద్), శ్రీవైభవి(నిజామాబాద్)లు తృతీయ స్థానాల్లో నిలిచారు.

క్రీడలు మానసిక, శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తాయి

జిల్లాస్థాయి సైక్లింగ్ పోటీలను ప్రారంభించిన భద్రాద్రి కలెక్టర్

లక్ష్మీదేవిపల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : క్రీడలు మానసిక, శారీరకదృఢత్వాన్ని పెంపొందిస్తాయని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఉద్ఘాటించారు. అంతర్జాతీయ క్రీడాదినోత్సవ వేడుకల్లో భాగంగా ఆదివారం భద్రాద్రి జిల్లా యువజన క్రీడల ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి సైక్లింగ్ పోటీలను కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమలో ఉన్న ప్రతిభ నైపుణ్యాలను వెలికి తీసేందుకు క్రీడా పోటీలు ఎంతగానో దోహదపడతాయని స్పష్టం చేశారు. ఈ క్రీడా పోటీలు అండర్-12, అండర్ - 17 జూనియర్స్ బాలబాలికలకు, 17 సంవత్సరాలు పైబడిన సీనియర్ మహిళలు, పురుషుల విభాగాల్లో సైక్లింగ్ పోటీలు నిర్వహించారు. లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలోని ఇల్లెందు క్రాస్‌రోడ్డు నుంచి చాతకొండ క్రాస్‌రోడ్డు వరకు సైక్లింగ్ పోటీలను నిర్వహించారు. 17 ఏళ్ల పైబడి సీనియర్ పురుషుల విభాగంలో లక్ష్మీదేవిపల్లి ఎస్ఐ రమణారెడ్డి ప్రథమ విజేతగా నిలిచి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నారు. ద్వితీయ విజేతగా నాగేశ్వరరావు, తృతీయ విజేతగా సుల్తాన్‌లు నిలిచారు. సీనియర్ మహిళా విభాగంలో హారిక ప్రథమస్థానం పొంది బంగారు పతకం, మీనాకుమారి ద్వితీయ, అరుణకుమారి తృతీయ విజేతలుగా నిలిచారు. అండర్-17 బాయ్స్ విభాగంలో బి.నాగచైతన్య ప్రథమ, బి.రాజేందర్ ద్వితీయ, ఎం.రాంచరణ్ తృతీయ విజేతలుగా నిలిచారు. అండర్-17 బాలికల విభాగాలో వి.జిషిక ప్రథమ, బి.సహస్ర ద్వితీయ, జి.భావన కార్తీక తృతీయ విజేతలుగా నిలిచారు. అదేవిధంగా అండర్-12 బాలుర విభాగంలో ఆర్.గణేష్ ప్రథమ, కే.ధనుష్ ద్వితీయ, కే.పార్థు తృతీయ విజేతలుగా నిలవగా బాలికల విభాగంలో సన్నిత ప్రథమ, గౌతమ ద్వితీయ విజేతలుగా నిలిచి బహుమతులను కైవసం చేసుకున్నారు. ప్రథమ బహుమతిగా బంగారు పథకాన్ని,



సైక్లింగ్ పోటీలో విజేతలకు మెమెంటోలను అందచేసిన కలెక్టర్

ద్వితీయ బహుమతిగా వెండి, తృతీయ బహుమతిగా క్యాంస పతకాన్ని విజేతలకు కలెక్టర్ జితేష్ వి పాటిల్ అందజేసి అభినందించారు. ఈ పోటీల్లో జిల్లా యువజన క్రీడల అధికారి పరంధామరెడ్డి, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ నరేష్‌కుమార్, క్రీడాకారులు పాల్గొని ఉత్సాహాన్ని ప్రదర్శించారు. ఇదిలా ఉండగా సైక్లింగ్ పోటీలను నిర్వహించేందుకు అనువుగా రోడ్డు మరమ్మతు పనులను ఎస్ఐ రమణారెడ్డి సహకారంతో చేపట్టారు.

రాష్ట్ర జూనియర్ అథ్లెటిక్స్‌లో 'భద్రాద్రి'కి 38 పతకాలు

చుంచుపల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్-2025 పోటీల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రీడాకారులు 38 పతకాలను గెలుపొందారు. తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ జిల్లాలోని పాలమూరు వర్సిటీ స్టేడియంలో ముగిసిన రాష్ట్ర జూనియర్ అథ్లెటిక్ ఛాంపియన్ షిప్‌లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అథ్లెట్లు 30 మంది పాల్గొని 38 పతకాలు గెలుపొందారు. వీటిలో 11 బంగారు పతకాలు, 17 రజతాలు, 10 కాంస్య పతకాలు ఉన్నాయని, జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.మహిధర్ ఆదివారం తెలిపారు. కార్యక్రమంలో చీఫ్ కోచ్ పి.నాగేందర్, కోచ్‌లు జె.గిరిప్రసాద్, డి.మల్లికార్జున్, నాగరాజు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యంపై కేసు నమోదు



రవికుమార్ (ఫైల్)

దుమ్ముగూడెం ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ములకపాడుకు చెందిన సిద్ధి రవికుమార్ అదృశ్యంపై ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈనెల 26న తన మిత్రుడు దాసరి ప్రశాంత ఇంటికి వెళ్లి భోజనం చేసిన తర్వాత నుంచి కనబడలేదు. ఆచూకీ కోసం బంధువులు, తెలిసిన వారి ఇళ్లలో వెతికినా ప్రయోజనం కనబడలేదు. రవికుమార్‌కు అప్పుడప్పుడు ఫిట్స్ వస్తాయని బంధువులు పేర్కొన్నారు. కానీ ఇప్పటివరకు ఇంటికి రాకుండా ఎక్కడికి వెళ్లాడో తెలియకపోవడంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ వెంకటప్పయ్య దర్యాప్తు చేపట్టారు.



ఆటో డ్రైవర్ అదృశ్యం: కేసు నమోదు

ఖమ్మంక్రైం, ఆగస్టు31 (ఆంధ్రజ్యోతి): ఆటోడ్రైవర్ అదృశ్యమైన సంఘటనపై ఆదివారం రాత్రి ఖానాపురంహవేలి పోలీస్‌స్టేషన్‌లో కేసునమోదైంది. వైఎస్‌ఆర్ కాలనీలో నివాసముండే 45 ఏళ్ల పొట్టపల్లి నారాయణ ఆటోడ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం ఉదయం ఆటో తీసుకొని బయటకు వెళ్లి తిరిగిరాలేదు. భార్య ఫోన్‌చేస్తే ఫోన్ స్విచ్ఛాఫ్ రావటంతో బంధువులకు సమాచారం ఇచ్చింది. వారు పలుచోట్ల వెతికారు. నగర శివారులోని సాగర్ కాలువ సమీపంలో బంధువులకు ఆటో కనిపించింది. కానీ నారాయణ కనిపించలేదు. దీంతో భార్య మాధవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అన్నదానాలు, కుంకుమ పూజలు



50వ డివిజన్‌లో అన్నదాన కార్యక్రమం ప్రారంభిస్తున్న మేయర్ నీరజ, కార్పొరేటర్ శరత్



తిరుమలాయపాలెంలో అన్నదానం..



బ్యాంకు కాలనీలో శ్రీహర్ష అపార్టుమెంటులో..

ఖమ్మంఖానాపురంహవేలి, ఆగస్టు31 (ఆంధ్రజ్యోతి): గణేష్ నవరాత్రుల్లో భాగంగా ఆదివారం జిల్లాలోని పలు గణేష్ మండపాల వద్ద అన్నదానాలు, కుంకుమ పూజ, సరస్వతీ పూజలు నిర్వహించారు. 1వడివిజన్ కైకొండాయిగుడెంలోని రైల్వేకాలనీలో ఆదివారం గణేష్ మండపం వద్ద కుంకుమపూజ, అనంతరం అన్నదానం నిర్వహించారు.మహిళలకు కుంకుమపూజ సామగ్రిని గణేష్ మండప నిర్వాహకులే అందించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి దర్శించుకొని అన్నదానం ప్రసాదం స్వీకరించారు. విజయనగర్ కాలనీలోని గణేష్ మండపం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బ్యాంకుకాలనీలో సిద్ధివినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సరస్వతీపూజ నిర్వహించారు. నగరంలోని స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో విద్యార్థులచే సరస్వతీ పూజ నిర్వహించారు.జయనగర్‌కాలనీ,ఖానాపురం,ప్రశాంతినగర్, కృష్ణుడి గుడి వద్ద గణేష్ మండపాల వద్ద అన్నదానాలు నిర్వహించారు. 25వ డివిజన్‌లోని శ్రీబాలగణేష్ రాజా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మహారుద్రహోమం నిర్వహించారు.



రాజీవ్‌గృహకల్పలో పూజలో పాల్గొన్న దయాకరరెడ్డి

50వ డివిజన్‌లో అన్నదానం

ఖమ్మంకార్పొరేషన్: 50వడివిజన్‌లోని రమణగుట్టలో స్థానిక కార్పొరేటర్ రాపర్తి శరత్‌కుమార్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. 1800మంది వరకు అన్నదానం చేశారు. కార్యక్రమాన్ని మేయర్ పునుకొల్లు నీరజ అన్నదానం వడ్డించి ప్రారంభించారు. ఖమ్మం ప్రజలు ఎటువంటి విపత్తులకు గురికాకుండా ఉండాలని ఆకాంక్షించారు.

25వ డివిజన్‌లో మహా రుద్రాభిషేకం
పాల్గొన్న కార్పొరేటర్ గోళ్ల దంపతులు

గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా 26వ డివిజన్‌లో ఆదివారం మహారుద్రాభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ గోళ్ల చంద్రకళ, వెంకటేశ్వర్లు దంపతులు పూజలో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

అన్నదానం

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెంలో హరినాథబాబాయూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆనన్నదాన కార్యక్రమంను ఆత్మ కమిటీ ఛైర్మన్ చావా శివరామకృష్ణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీఎంపీపీ బోడ మంగిలాల్, తాటికొండకిరణ్, అంబేద్కర్, సైపుద్దీన్, ప్రవీన్, తదితరులు పాల్గొన్నారు.



రైల్వే కాలనీలో కుంకుమపూజ



విజయనగర్ కాలనీలో అన్నదానం







స్మార్ట్‌కిడ్జ్‌లో సరస్వతీ పూజ.., ఆంధ్రజ్యోతి కార్యాలయంలో పూజ చేస్తున్న దంపతులు, విజయనగర్ కాలనీలో పాల్గొన్న తుమ్మల యుగంధర్..



రుద్ర హోమం నిర్వహిస్తున్న కార్పొరేటర్ చంద్రకళ

సాంఘిక సంక్షేమశాఖ ఇన్‌చార్జ్ డీడీగా జ్యోతి

ఖమ్మంసంక్షేమ విభాగం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సాంఘీక సంక్షేమశాఖ ఇన్‌చార్జ్ డిప్యూటీ డైరెక్టర్‌గా జ్యోతి బాధ్యతలు తీసుకొనున్నారు. గతంలో డీడీగా బాధ్యతలు నిర్వహించిన కస్తాల సత్యనారాయణ ఆదివారం పదవీ విరమణ చేయటంతో ఈ మేరకు బీసీ వెల్ఫేర్ అధికారిగా పని చేస్తున్న జ్యోతికి అదనపు బాధ్యతలు కేటాయించారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి



లేఖలను పోస్టుబాక్సులో వేస్తున్న తెలంగాణ ఉద్యమకారులు

ఖమ్మంచర్చికాంపౌండ్, ఆగస్టు31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారులకు గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలుచేయాలని కోరుతూ లోక్‌సభ ప్రతిపక్షనాయకుడు, కాంగ్రెస్‌పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీకి తెలంగాణ ఉద్యమకారులు ఆదివారం లేఖ రాశారు. ఈమేరకు ఆదివారం నగరంలోని అమరవీరుల స్థూపం వద్ద ఉద్యమకారులకు ఇచ్చిన హామీలైన ప్రతీ తెలంగాణ ఉద్యమకారుడికి 250గజాల స్థలం, గృహనిర్మాణానికి రూ.10లక్షల నగదు, పెన్షన్ సౌకర్యం కలిపించాలని కోరుతూ రాసి పోస్టుబాక్సులో లేఖలు వేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులఫోరం రాష్ట్ర స్టీరింగ్ కమిటీచైర్మన్ కేవీ కృష్ణారావు, ఫోరం రాష్ట్ర స్టీరింగ్ కమిటీచైర్మన్ డాక్టర్ కేవీ కృష్ణారావు , ఉమ్మడి ఖమ్మంజిల్లా చైర్మన్ పసుపులేటి నాసరయ్య, అర్వపల్లి విద్యాసాగర్, పగడాల నరేందర్, బచ్చల పద్మాచారి, నాగుల్‌మీరా పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లిని దర్శించుకున్న జిల్లా జడ్జి

పాల్వంచరూరల్, ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేవీ జగన్నాథపురంలో గల పెద్దమ్మతల్లి ఆలయంలోని అమ్మవారిని ఆదివారం జిల్లా జడ్జి రాజగోపాల్ కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. దేవస్థానం ఆలయ చైర్మన్ బాలినేని నాగేశ్వరావు, ఈవో రజనికుమారి, అర్చకులు సంప్రదాయ పద్ధతిలో స్వాగతం పలికారు. గర్భగుడిలో పట్టువస్త్రాలను అందజేశారు. వేదపండితులు ప్రత్యేక పూజలను జరిపారు. అమ్మవారిని దర్శించునేందుకు పలుప్రాంతాల నుంచి భక్తులు వేలాది మంది తరలివచ్చారు. అమ్మవారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.



రాజగోపాల్ దంపతులకు పట్టువస్త్రాలు అందజేస్తున్న దృశ్యం

మున్నేరు వరద ఉప్పెనలో.. అధికారుల అండ

- రాత్రి3గంటల నుంచే సహాయక చర్యలు
- కమిషనర్ ఫోన్ మాట్లాడుతుండగానే ఉధృతి

మున్నేరు వరదకు ఏడాది





వరద ప్రాంతాల్లో సహాయక చర్యల్లో పాల్గొన్న మేయర్ నీరజ, కమిషనర్ అగస్త్య, రాత్రి 3గంటల సమయంలో ప్రజలను అప్రమత్తం చేస్తున్న కమిషనర్(ఫైల్)

ఖమ్మంకార్పొరేషన్, ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): గత ఏడాది సెప్టెంబరు ఉదయం 3గంటల సమయం క్యాంపు కార్యాలయంలో ప్రశాంతంగా నిద్రపోవాల్సిన ఐఏఎస్ అధికారి కాల్వొడ్డులో మున్నేరు వరదలపై ఉద్యోగులను అప్రమత్తం చేస్తున్నారు. కారు దిగి పది అడుగులు వేసి మున్నేరు వాగు వైపు చూస్తుండగానే ఉప్పెనగా వచ్చిన వరద పోటు ఒక్కసారిగా కమ్మేసింది. కారు చక్రాలు మునిగే వరకు వరద ఉప్పెన వచ్చి పడింది. దీంతో చాకచక్యంగా వ్యవహరించిన ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య అక్కడ నుంచి కారులో బయటకు వచ్చారు. అయినా లెక్క చేయలేదు. అక్కడే ఉంటూ మున్నేరు ముంపు ప్రాంతాల్లోని బాధితులకు సహాయం అందించారు. పూర్వ కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఉదయం 5గంటలకే మున్నేరు పరివాహక ప్రాంతంలోకి చేరుకొని అధికారులకు ఆదేశాలిచ్చారు. కేఎంసీ ఎస్‌ఈ రంజిత్ పడవలో మున్నేరులోకి వెళ్లి కొంత మంది బాధితులు బయటకు తరలించారు. పూర్వ కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్ సంపత్‌కుమార్ విశేషమైన సేవలు అందించారు. మున్నేరు వరద సమయంలో బాధితులకు మంచినీళ్లు, పారిశుధ్యంపై యుద్ధ ప్రాతిపదికన చర్యలను చేపట్టారు. నివాసాలు, రహదారులపై పేరుకుపోయిన బురదను తొలగించేందుకు వందల కొద్ది నీటి ట్యాంకర్ల ట్రాక్టర్లును వినియోగించారు. రెండు డీఆర్‌ఎఫ్ బృందాలు ఆధ్వర్యంలో ముంపు ప్రాంతాల నుంచి వృద్దులు, పిల్లల్ని తరలించారు. ఇళ్లలో ఉన్న పత్రాలు, మిగిలిన వస్తువులను మైదాన ప్రాంతాలకు తరలించారు. ప్రతీ వీధికి డీఆర్‌ఎఫ్ బలగాలను ఏర్పాటుచేసి బాధితులు తిరిగి ముంపుకు గురికాకుండా కాపలా చేశారు. ఈఈ కృష్ణలాల్, పట్టణ ప్రణాళిక అధికారి గంధం వసుందర పునరావాస కేంద్రాల పర్యవేక్షణ చేశారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) టీఎంసీ గుడిపూడి సుజాతరాణి ఆధ్వర్యంలో నిత్యవసరాలు, సరుకులు, భోజనాల ప్యాకెట్లు పంపిణీ చేశారు. బెడ్ షీట్లు, దుస్తులు పంపిణీ చేశారు. మూడు నెలల పాటు స్వచ్ఛంద సంస్థలు అందించిన సౌకర్యాలను మెప్మా సీవోలు పంపిణీ చేశారు. పూర్వ ఆర్వో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ముంపు బాధితుల నివాసాల్లో సర్వే చేపట్టారు. రెండు రోజుల్లోనే 90శాతం నివాసాలను సర్వే చేశారు. పూర్వ ఏవో శివలింగం బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అందించిన పరిహారం పంపిణీ చేశారు.

అండగా నిలిచిన పాలకవర్గం

మున్నేరు వరదల సమయంలో ఖమ్మం పాలకవర్గం అధికారులకు అండదండగా నిలిచింది. మేయర్ పునుకొల్లు నీరజ నుంచి కార్పొరేటర్లు తమ వంతుగా ముందుకు వచ్చారు. స్వచ్ఛందంగా సేవా కార్యక్రమాలు నిర్వహించారు. నెలరోజులు పాటుగా కంటికి నిద్ర లేకుండా బాధితులకు అండగా నిలిచారు. మున్నేరు పరివాహకంతో పాటుగా 10వ డివిజన్, 11వడివిజన్ కార్పొరేటర్లు విశేషంగా సేవలు అందించారు. అధికారులకు, బాధితులకుసమన్వయంగా వ్యవహరించారు. అంతటి విపత్తులో కూడా ఎటువంటి అంటువ్యాదులు రాకుండా పారిశుధ్య కార్యక్రమాలు చేశారు.

అభివృద్ధిపై మాట్లాడే అర్హత బీఆర్‌ఎస్‌కు లేదు

మేయర్ పునుకొల్లు నీరజ



మాట్లాడుతున్న మేయర్ నీరజ

ఖమ్మంకార్పొరేషన్, ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): నగరంలో జరిగిన అభివృద్ధిపై మాట్లాడే కనీసఅర్హత బీఆర్‌ఎస్ నాయకులు, కార్పొరేటర్లుకు లేదని, తమ తప్పులను కప్పి పుచ్చుకునేందుకే ఖమ్మం నగర పాలక వర్గంపై ప్రేలాపనలు చేస్తున్నారని మేయర్ పునుకొల్లు నీరజ విమర్శించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్యాంపు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మేయర్ మాట్లాడారు. కాంగ్రెస్ కార్యకర్త సాయికిరణ్‌పై దాడి చేసిన బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు తిరిగి ఎదురు దాడి చేస్తున్నారని, ఇటువంటి వాటిని సహించబోమని హెచ్చరించారు. ఖమ్మం నగరంలో రూ.2కోట్లతో వెలుగుమట్ల అర్బన్ పార్కు, రూ.250 కోట్లతో అండర్ డ్రెయినేజీ, రూ.100 కోట్లతో రహదారులు, డ్రెయినేజీలు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభివృద్ధి చేశారన్నారు. విలీన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేకంగా బడ్జెట్‌లో నిధులు కేటాయించారని గుర్తు చేశారు. డిప్యూటీ మేయర్ పాతిమా జోహేరా, కార్పొరేటర్ కమర్తపు మురళి, నాయకులు ముక్తార్, కన్నం ప్రసన్నకృష్ణ, సాయికిరణ్ పాల్గొన్నారు.

శాంతి ర్యాలీ

ఖమ్మంఖానాపురంహవేలి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా సీఎస్‌ఐ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం క్రైస్తవులు సమాధుల స్థలసాధన మహా శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ సెయింట్ మేరీస్ సీఎస్‌ఐ చర్చి నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐక్య వేదిక పాస్టర్లు మాట్లాడుతూ క్రైస్తవులు చనిపోతే ఖనం చేసేందుకు కొనుగోలు చేసిన ఐదు ఎకరాల భూమిని కొందరు ఆక్రమించుకొని నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి క్రైస్తవులు భూమిని రక్షించాలని కోరారు. అనంతరం అబేంద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు.ఈ కార్యక్రమంలో వి.విశ్వం, రమేష్, కార్పోరేటర్ రోజ్‌లీనా, దొడ్డా. అశోక్, సీఎస్‌సీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఏదులాపురం మునిసిపల్ కమిషనర్‌కు పితృవియోగం

ఖమ్మంరూరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఏదులాపురం మునిసిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్ రెడ్డి తండ్రి ఆళ్ల హనుమారెడ్డి(87) అనారోగ్యంతో ఖమ్మంలోని ఓఆసుపత్రిలో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్నటువంటి రెవెన్యూ గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరి దయాకర్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీలు సన్యాసయ్య, అప్పారావు, మధుసూదన్ రాజు. తదితరులు హనుమారెడ్డి మృతదేహన్ని సందర్శించారు. నివాళులర్పించారు.ఆయన అంత్యక్రియలు స్వగ్రామం బోనకల్లు మండలం, ముష్టికుంట్లలో ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాణోత్ రెడ్డి

ఖమ్మంఖానాపురంహవేలి,ఆగస్టు31 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాణోత్‌రెడ్డిని కళాశాల విద్యాకమిషనర్ నియమించారని ఇంచార్జ్ ప్రిన్సిపాల్ పరంజ్యోతి తెలిపారు. ఆదివారం బాణోత్‌రెడ్డి ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. నగరంలోని ఎస్‌ఆర్‌బీజీఎన్‌ఆర్ డిగ్రీకళాశాలలో రసాయనశాస్త్ర అధ్యాపకుడిగా ఉన్న బాణోత్‌రెడ్డికి ఉద్యోగ ఉన్నతిపై మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమించారు.

సత్యనారాయణ సేవలు ప్రశంసనీయం

డీడీ వీడ్కోలు సభలో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, టీజేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏలూరి



కస్తాల దంపతులను సన్మానిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, టీజేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏలూరి

ఖమ్మంకలెక్టరేట్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిశాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా మూడున్నర దశాబ్దాలుగా కస్తాల సత్యనారాయణ చేసిన సేవలు ప్రశంసనీయమని జిల్లా అదనపు కలెక్టర్ పి శ్రీనివాసరెడ్డి, తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్సీ సంక్షేమశాఖ డీడీ, తెలంగాణ గెజిటెడ్ అధికారుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కస్తాల సత్యనారాయణ ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కార్యదర్శి మోదుగు వేలాద్రి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ పి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కస్తాల సత్యనారాయణ జిల్లా అధికారిగా విశేషమైన సేవలు అందించారని విద్యార్థులకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారిని మంచి పౌరులుగా తీర్చిదిద్దటంలో ఘనసీయమైన పాత్ర వహించారని భవిష్యత్తులో ఇదే సేవా గుణాన్ని కొనసాగించాలని ఆకాంక్షించారు. టీజేఏసీ రాష్ట్ర కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ సోషల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించటానికి అహర్నిశలు కృషి చేశారని అభినందించారు డీడీ కస్తాల సత్యనారాయణ మాట్లాడుతూ విధి నిర్వహణలో తమకు సహకరించిన కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అధికారులకు, సహోద్యోగులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో మాజీఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు రుక్మారావు, టీజీవో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సంఘం వెంకటపుల్లయ్య, మహేష్, టీఎన్జీవో జిల్లా కార్యదర్శి కొనిదేన శ్రీనివాసరావు, జయపాల్, అసోసియేట్ ప్రెసిడెంట్ దుర్గాప్రసాద్, కస్తాల వెంకటేశ్వరరావు, టీజీవో జిల్లా ట్రెజరర్ కొండపల్లి శేషు ప్రసాద్, టీజీవో అసోసియేట్ ప్రెసిడెంట్ వాసిరెడ్డి శ్రీనివాస్, టీజీవోహౌస్ బిల్డింగ్ సొసైటీ కార్యదర్శి డాక్టర్ పి.విజయకుమార్, భానోతు దస్రు, కొత్తగూడెం జిల్లా టీఎన్జీవో అధ్యక్షుడు అమర్నేని రామారావు, దేవరకొండ సైదులు తదితరులు పాల్గొన్నారు.

సేవ చేయడానికి స్థాయి అవసరం లేదు

- సీనియర్ వైద్యాధికారి గిరిసింహారావు
- ఘనంగా సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ వార్షికోత్సవం

ఖమ్మంకలెక్టరేట్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): సేవ చేయడానికి సంపద, స్థాయి అవసరం లేదని నిరూపించారని కరీంనగర్ జోనల్ ఆర్టీసీ ఆసుపత్రి సూపరింటెండెంట్, సీనియర్ వైద్యాధికారి ఏవీ గిరిసింహరావు అన్నారు. సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ 15వ వార్షికోత్సవాన్న ఖమ్మంలోని సంస్థ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా గిరిసింహారావు మాట్లాడుతూ 15ఏళ్లక్రితం అనిత, రవిచంద్ర కుటుంబంతో కలిసి డాక్టర్ రాజేష్ గార్గె, బాలకృష్ణ,డాక్టర్ రమేష్‌బాబు,తాను తలసీమియా చిన్నారులకు సేవ చేయడంపై చర్చించినట్లు తెలిపారు. నాడు వేసిన చిన్న విత్తనం నేడు మహావృక్షం అయి వందలాది మంది చిన్నారులు ఆశ్రయం పొందుతున్నారని అన్నారు. ఫౌండర్ ప్రొద్దుటూరి అనిత మాట్లాడుతూ 15ఏళ్లల్లో సంకల్ప స్వచ్ఛంద సేవాసంస్థ చేసిన సేవా కార్యక్రమాలు, దాతల సహకారం వివరించారు. ఈకార్యక్రమంలో పోలీస్ ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వేణుమాధవ్, డాక్టర్ డి.నారాయణమూర్తి, డాక్టర్ నరేష్, ప్రముఖ మహిళ వ్యాపారవేత్త మేడంపూడి రమాజ్యోతి, సంస్థ ఉపాధ్యక్షురాలు పి.పావని, పి.ఉదయ్ భాస్కర్, కోశాధికారి పి.రవిచంద్ర,పి.వంశీ,కిరీటి పాల్గొన్నారు.



తలసీమియా చిన్నారులతో కలిసి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల
నిర్మాణంలో ఉన్న ఇళ్ల పరిశీలన



ఇళ్లను పరిశీలిస్తున్న రాయల

నేలకొండపల్లి,ఆగస్టు31(ఆంధ్రజ్యోతి):ఇందిరమ్మ ప్రభుత్వం నిరుపేదలకు అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు కోరారు. ఆదివారం నేలకొండపల్లిలో ఇందిరమ్మ లబ్ధిదారులు నిర్మించుకుంటున్న ఇళ్లను రాయల పరిశీలించారు. రాష్ట్రంలో గత పది సంవత్సరాలుగా ఒక్క ఇల్లు కానీ, రేషన్ కార్డు కానీ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇవ్వలేదన్నారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడిన 18 నెలల్లో అర్హత ఉన్న ప్రతీ వ్యక్తికి రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తోందన్నారు. రేషన్ కార్డులజారీ, ఇందిరమ్మ ఇళ్ల నిరంతర ప్రక్రియని, ఇళ్లు రాని వాళ్ల నిరుత్సాహ పడరాదని విన్నవించారు. అర్హులైన ప్రతీ వ్యక్తికి ఇందిరమ్మ ఇల్లు వస్తుందని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో యూరియా కొరత కేంద్ర ప్రభుత్వ సృష్టేనన్నారు. రాష్ట్రంపై కేంద్రం వివక్ష చూపుతున్నదని రాయల ఆరోపించారు. యూరియా కొరత తీర్చటానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని రాయల అన్నారు. అనంతరం రాయల నాగేశ్వరరావు వినాయక మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ నాయకులు బచ్చలకూరి నాగరాజు, యడవల్లి నాగరాజు, బొడ్డు బొందయ్య, అనంతు నాగేంద్రబాబు, గోపి పాల్గొన్నారు.

వైరా మునిసిపాలిటీలో సిబ్బంది చేతివాటం

» రూ.6.33లక్షల వాణిజ్య సముదాయాల నిధులు స్వాహా

వైరా, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీలో ఇద్దరు అవుట్ సోర్సింగ్ బిల్ కలెక్టర్లు చేతి వాటానికి పాల్పడ్డారు. ఇద్దరు సిబ్బంది రూ.6.33లక్షల వాణిజ్య సముదాయాల పన్నుల సొమ్మును కాజేశారు. రెండు నెలల నుంచి వాణిజ్య సముదాయ కాంప్లెక్స్‌ల పన్నులను అవుట్ సోర్సింగ్‌కు చెందిన ఇద్దరు బిల్ కలెక్టర్లు వసూలు చేసి మునిసిపాలిటీ ఖాతాలో జమ చేయకుండా స్వాహా చేసి తమ సొంత అవసరాలకు వాడుకున్నారు. మునిసిపాలిటీలో పూర్వపు వీఆర్‌వోలు వార్డు ఆఫీసర్లుగా ఉన్నప్పటికీ వారి వద్ద ఉండాల్సిన పన్ను వసూలు రశీదు పుస్తకాలను అవుట్ సోర్సింగ్ బిల్ కలెక్టర్లకు అప్పగించారు. దాంతో అందివచ్చిన అవకాశంగా భావించి తాము వసూలు చేసిన పన్నుల సొమ్మును ఇద్దరు సిబ్బంది తమ సొంత అవసరాలకు వాడుకున్నారు.



వైరా మునిసిపాలిటీ

గత మునిసిపల్ కమిషనర్ ఈ పన్నుల వసూళ్లపై సరైన పర్యవేక్షణ లేకపోవడంతో అవుట్ సోర్సింగ్ సిబ్బంది ఆడిందే ఆట.. పాడిందే పాటగా ఉంది. మునిసిపాలిటీ కార్యాలయంలోని జూనియర్ అకౌంటెంట్ ఒకరు వాణిజ్య సముదాయాల పన్నులు వసూలు చేసేందుకు నిబంధనలకు విరుద్ధగా అవుట్ సోర్సింగ్ బిల్ కలెక్టర్లకు రశీదు పుస్తకాలు అప్పగించారు. ఇదే అదునుగా భావించి రెండు నెలల నుంచి వసూలు చేస్తున్న కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్ పన్నులను బిల్ కలెక్టర్లు మునిసిపాలిటీలోని 002పద్దు ఖాతాలో జమచేయలేదు. జంకూబొంకూ లేకుండా ఆ మొత్తాన్ని స్వాహా చేశారు. గతనెల 25వతేదీన మునిసిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన యు.గురులింగం దృష్టికి వెళ్లడంతో వెంటనే అంతర్గత విచారణ జరిపారు. కమర్షియల్ వాణిజ్య సముదాయాల యజమానులు పన్నులు చెల్లించిన తేదీలు, రశీదు పుస్తకాలపై ఉన్న తేదీలు వేర్వేరుగా ఉండడంతో వెంటనే ఇద్దరు అవుట్ సోర్సింగ్ బిల్ కలెక్టర్లను కమిషనర్ గురులింగం, మేనేజర్ సుధాకర్ ప్రశ్నించి నిలదీశారు. దాంతో తాము స్వాహా చేసిన నగదును శనివారం అవుట్ సోర్సింగ్ బిల్ కలెక్టర్లు మునిసిపాలిటీ మేనేజర్‌కు అప్పగించినట్లు సమాచారం. ఈ ఇద్దరే కాకుండా మరి కొంతమంది అవుట్ సోర్సింగ్ బిల్ కలెక్టర్లు కూడా లక్షలాదిరూపాయల నిధులు స్వాహా చేసి ఉంటారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. ఇప్పటికైనా నూతన కమిషనర్ గురులింగం అవుట్‌సోర్సింగ్ సిబ్బంది పనితీరుపై నిఘా ఉంచి విచారణ చేసి అవకతవకలను వెలుగులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

పంటలకు నష్టపరిహారం అందించాలి

తల్లాడ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలతో నష్టపోయి పంటలకు పరిహారం అందజేసి బాధిత రైతులను ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకుడు శీలం సత్యనారాయణరెడ్డి కోరారు. తల్లాడ మండలం కుర్నవల్లిలో భారీ వర్షాలతో నష్టపోయిన పంటలను ఆదివారం తెలంగాణ రైతు సంఘం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన వర్షాలకు పెసర పంట పూర్తిగా దెబ్బతిన్నదని, ఎకరానికి నాలుగైదు క్వింటాళ్ల దిగుబడి వచ్చి ప్రస్తుత అవసరాలకు ఉపయోగపడే పెసర పెట్టుబడులన్నీ పూర్తయి పంట చేతికొచ్చే చివరి దశలో వర్షాలకు తుడిచిపెట్టుకుపోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. వ్యవసాయ శాఖ ద్వారా పంట నష్టాన్ని అంచనా వేసి నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అదించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పంటల బీమా పథకం రైతులకు ఉపయోగం లేకపోగా బీమా కంపెనీలకు ఆదాయం వనరుగా మారిందన్నారు. అయిలూరి సత్యనారాయణరెడ్డి, శీలం శ్రీనివాస రెడిడ, రామిరెడ్డి పాల్గొన్నారు.

వైరా, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): గడచిన ఐదారురోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు దెబ్బతిన్న అన్నిరకాల పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా, మండల కార్యదర్శులు బొంతు



కుర్నవల్లిలో పెసర పైరును పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

రాంబాబు, కిలారు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. బాధిత రైతులతో కలిసి భారీ వర్షాలతో దెబ్బతిన్న పంటలను రైతుసంఘం బృందం ఆదివారం పరిశీలించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారీ వర్షాలతో పెసర పంట పూర్తిగా దెబ్బతిన్నదని తెలిపారు. ఎకరాకు నాలుగు నుంచి ఐదు క్వింటాళ్ల దిగుబడి వచ్చే పెసర పంట ఎందుకూ పనికిరాకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కౌలురైతులు ఎకరాకు రూ.20నుంచి రూ.30వేలు ముందస్తు కౌలు చెల్లింపులు చేసి పంటలు సాగుచేస్తే భారీ వర్షాలతో పంటలు దెబ్బతిని దిక్కుతోచని స్థితిలో ఉన్నారని తెలిపారు. ఈ పంటల నష్టంపై సమగ్ర సర్వే చేసి ప్రభుత్వం రైతులకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. వైరా సొసైటీ వైస్‌చైర్మన్ కొణిధన కోటేశ్వరరావు, రైతుసంఘం నాయకులు వెంపటి రాజా, చిత్తారు నాగరాజు, అమరనేని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణ సేవలు ప్రశంసనీయం

డీడీ వీడ్కోలు సభలో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, టీజేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏలూరి

ఖమ్మంకలెక్టరేట్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ కులాల అభివృద్ధిశాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా మూడున్నర దశాబ్దాలుగా కస్తాల సత్యనారాయణ చేసిన సేవలు ప్రశంసనీయమని జిల్లా అదనపు కలెక్టర్ పి శ్రీనివాసరెడ్డి, తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్సీ సంక్షేమశాఖ డీడీ, తెలంగాణ గెజిటెడ్ అధికారుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కస్తాల సత్యనారాయణ ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కార్యదర్శి మోదుగు వేలాద్రి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ పి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కస్తాల సత్యనారాయణ జిల్లా అధికారిగా విశేషమైన సేవలు అందించారని విద్యార్థులకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారిని మంచి పౌరులుగా తీర్చిదిద్దటంలో ఘనసీయమైన పాత్ర వహించారని భవిష్యత్తులో ఇదే సేవా గుణాన్ని కొనసాగించాలని ఆకాంక్షించారు. టీజేఏసీ రాష్ట్ర కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ సోషల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించటానికి అహర్నిశలు కృషి చేశారని అభినందించారు డీడీ కస్తాల సత్యనారాయణ మాట్లాడుతూ విధి నిర్వహణలో తమకు సహకరించిన కలెక్టర్



కస్తాల దంపతులను సన్మానిస్తున్న అదనపు కలెక్టర్, టీజేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏలూరి

అనుదీప్ దురిశెట్టి, అధికారులకు, సహోద్యోగులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు రుక్మారావు, టీజీవో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సంఘం వెంకటపుల్లయ్య, మహేష్, టీఎన్జీవో ఖమ్మం జిల్లా కార్యదర్శి కొనిదేన శ్రీనివాసరావు, జయపాల్, అసోసియేట్ ప్రెసిడెంట్ దుర్గాప్రసాద్, కస్తాల వెంకటేశ్వరరావు, టీజీవో జిల్లా ట్రెజరర్ కొండపల్లి శేషు ప్రసాద్, టీజీవో అసోసియేట్ ప్రెసిడెంట్ వాసిరెడ్డి శ్రీనివాస్, టీజీవో హౌస్ బిల్డింగ్ సొసైటీ కార్యదర్శి డాక్టర్ పి విజయకుమార్, భానోతు దస్రు, కొత్తగూడెం జిల్లా టీఎన్జీవో అధ్యక్షులు అమర్నేని రామారావు ,దేవరకొండ సైదులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల అరెస్ట్

ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్): రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేసేందుకు ప్రయత్నిస్తున్న బీజేపీ నాయకులను పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. ప్రధానమంత్రి మోడీ తల్లిను విమర్శించిన రాహుల్‌గాంధీకు మహిళలపై ఉన్న గౌరవం ఇదేనా అని బీజేపీ నాయకులు ప్రశ్నించారు.



చింతకానిలో..



బోనకల్‌లో..



ముదిగొండలో..

పోలీసుల అదుపులో గొర్రె దొంగలు

కారేపల్లి ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఉసిరికాయలపల్లి గ్రామంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు గడ్డం వెంకటేశ్వర్లుకు సంబంధించిన తగరు (పెద్ద పోటేలు)ను శనివారం రాత్రి దొడ్లో కటేసిఉండగా ఇద్దరు వ్యక్తులు గొర్రెపోతును అపహరించకుని పారిపోయారు. ఇది గమనించిన గడ్డం వెంకటేశ్వర్లు, అతని కుటుంబ సభ్యులు గ్రామంలో విచారిస్తున్న సమయంలో దూదిమెట్ల శివ, ఎల్లబోయిన సురేష్ అనే వ్యక్తులపై అనుమానం వచ్చిన గడ్డ వెంకటేశ్వర్లు వారిని ప్రశ్నంచడంతోపాటు, శివ వేసుకున్న చొక్కపై గొర్రెపోతును ఎత్తుకున్నట్లు అనవాళ్ళు కనిపించడంతో వారిని ఎంతసేపు ప్రశ్నంచిన సమాధానం చెప్పకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసుల విచారణలో గొర్రెపోతును పోలీసులు రికవరీ చేశారు. ప్రస్తుతం పోలీసుల అదుపులోనే గొర్రెపోతు ఉంది.



పోలీసుల అదుపులో ఉన్న తగరు(పెద్దపోటేలు)

సత్తుపల్లి నియోజకవర్గంలో సీఆర్ఆర్ కింద రూ.15కోట్లు మంజూరు

▸▸ ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి

సత్తుపల్లి, ఆగస్టు31 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి నియోజకవర్గంలో సీఆర్ఆర్ కింద బీటీ రోడ్లతోపాటు ఇతర పనులకు రూ.15కోట్లు మంజూరైనట్లు సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి ఆదివారం తెలిపారు. కల్లూరు మండలంలోని పేరువంచ నుంచి కుప్పెనకుంట్ల వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి సీఆర్ఆర్ నిధుల కింద రూ.7కోట్లు, నారాయణపురం నుంచి కొర్లగూడెం ఆర్‌అండ్‌బీ రోడ్డు మీదుగా రామకృష్ణాపురం వరకు రూ.4కోట్లతో రోడ్డు నిర్మాణంతోపాటు కొత్త నారాయణపురం ఎన్ఎస్‌పీ కెనాల్ లిఫ్ట్ నిర్మాణానికి రూ.2కోట్లు మంజూరు అయినట్లు చెప్పారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తూ నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావులతోపాటు ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయికి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

కాళేశ్వరం ప్రాజెక్టు రివ్యూలో ఎమ్మెల్యే

హైదరాబాద్‌లోని ఎర్రమంజిల్ జలసౌధాలో నిర్వహించిన కాళేశ్వరం ప్రాజెక్టు రివ్యూ సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి పాల్గొన్నారు. ఈ రివ్యూలో ఉప ముఖ్యమంత్రి భట్టితో పాటు మంత్రులు, జిల్లా ఇంచార్జీ మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.



మంత్రి భట్టితో ఎమ్మెల్యే మట్టా రాగమయి

మధిర రైల్వే స్టేషన్‌కు ఆధునిక హంగులు

» మెరుగైన సౌకర్యాల కల్పనే లక్ష్యం

» రూ.25 కోట్లతో ఆధునికీకరణ పనులు

మధిర, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మధిర రైల్వే స్టేషన్‌ను కేంద్ర ప్రభుత్వం అమృత్ భారత్ పథకంలో చేర్చడంతో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అనేక పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం దేశంలోని 1275 రైల్వే స్టేషన్లను ఆధునీకరించేందుకు 2023లో నిర్ణయంచి వీటిని అమృత్ భారత్ పథకం కిందకు తీసుకురావడంతో స్టేషన్ స్థాయి ప్రకారం నిధులను కేటాయించి ఆధునీకరణ పనులకు శ్రీకారం చుట్టింది. ఈ పథకం కింద మధిర స్టేషన్‌ను ఎంపిక చేయడంతో మధిర రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులకు రూ. 25 కోట్ల రూపాయలను మంజూరు చేసింది. ఈ నిధులతో గతంలో ఉన్న ఫుట్ ఓవర్ బ్రిడ్జికి అదనంగా మరో ఫుట్ ఓవర్ బ్రిడ్జిని దక్షిణం వైపు బుకింగ్ కౌంటర్ వరకు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. గతంలో ఉన్న వాహన పార్కింగ్‌ను తొలగించి దానికి ఆనుకుని ఉన్న రైల్వే క్వార్టర్లను తొలగించి విశాలమైన వాహనాల పార్కింగ్ స్టాండ్‌ను నిర్మించారు. గతంలో రెండు ప్లాట్ ఫారాలే ఉండగా వీటికి అదనంగా మూడో ప్లాట్ ఫాంను నిర్మించారు. ప్రయాణకులు వేచి ఉండేందుకు ఆదునిక హంగులతో వెయిటింగ్ హాల్‌ను నిర్మించారు. ప్లాట్ ఫారాలపై గతంలో ఉన్న షెడ్డులను తొలగించి నూతన షెడ్డుల నిర్మాణ పనులు చేస్తున్నారు గతంలో ఉన్న వాటికి అదనంగా నూతన షెడ్డులను నిర్మిస్తున్నారు. టికెట్ కౌంటర్‌తోపాటు వెయిటింగ్ హాల్, స్టేషన్ గోడల మొత్తానికి గ్రానైట్ వేసారు, రైల్వే స్టేషన్‌కు వచ్చే మార్గాన్ని వెళ్లే మార్గాలను వేరు వేరుగా నిర్మిస్తున్నారు. స్టేషన్‌లో హైమాస్ లైట్లను ఏర్పాటు చేయడమే కాకుండ ప్లాట్ ఫారాలపై కోచ్ పొజీషన్లు తెలిపే ఎలక్ట్రానిక్ డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. ఏడాది క్రితం ప్రారంభమైన పనులు వేగంగా జరుగుతుండగా మరో ఆరు నెలల్లో పనులు పూర్తి చేసి పునఃప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇటీవలే దక్షిణ మధ్య రైల్వే డీఆర్ఎం గోపాలకృష్ణన్ స్టేషన్‌లో జరుతున్న పనులను పరిశీలించి పనుల వేగం పెంచాలని అధికారులను ఆదేశించి పలు సూచనలు చేశారు.



అధునాతన ప్రయాణికుల వెయిటింగ్ హాల్

గుండెపోటుతో వ్యక్తిమృతి

కారేపల్లి ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పేరుపల్లి గ్రామానికి చెందిన షేక్ ఖలీమ్(50) శనివారం అర్ధరాత్రి హైదరాబాద్‌లో గుండెపోటుతో మృతి చెందడం జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఖలీమ్ కొంత కాలంగా హైదరాబాద్‌లో ఉంటున్న ఖలీమ్ శనివారం అర్ధారాత్రి మంచినీళ్ల తాగేందుకు లేచి అనంతరం తన గుండెలో నోప్పివస్తుందని కుటుంబ సభ్యులకు చెప్పాడు,వెంటనే కుటంబసభ్యులు సమీపంలోని ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు మృతిచెందిన్నట్లు తెలిపారు. అతనికి భార్య, కుమారుడు ఉన్నారు.

రింగ్‌సెంటర్‌లో రోడ్డుకు మరమ్మతులు

తల్లాడ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మూడు జాతీయ రహదారులకు కూడలి అయినా తల్లాడ రింగ్‌సెంటర్‌లో ప్రమాదకరంగా ఉన్న రోడ్డుకు ఆదివారం మరమ్మతులు చేశారు. రింగ్‌సెంటర్‌లో మోకాలి లోతు గుంతలతో వరదనీరు నిలిచి ప్రధాన రహదారి ప్రమాదకరంగా మారింది. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలతో రద్దీగా ఉండే రింగ్‌సెంటర్‌లో రోడ్డుపై ప్రయాణించే వాహనదారులు నరకయాతన పడుతుండడంతో తల్లాడ ఎస్ఐ ఎన్.వెంకటకృష్ణ ప్రత్యేక చొరవ తీసుకుని రోడ్డుపై గుంతలు పూడ్చే కార్యక్రమం చేపట్టారు. ప్రమాదకరంగా ఉన్న రోడ్డుపై గుంతలు పూడ్చడం వల్ల వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు.



ఘనంగా గణేష్ నిమజ్జనోత్సవాలు


కల్లూరులోని పలు ప్రాంతాల్లో గణేష్ ఉత్సవ కమీటీల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా గణేష్ నిమజ్జనోత్సవాలు జరుపుకున్నారు. అలాగే చింతకాని మండల పరిధిలోని లచ్చగూడెం గ్రామంలో శ్రీకృష్ణ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం వినాయకుడిని కరెన్సీ నోట్లతో అలంకరించారు. అలాగే కొణిజర్ల మండల పరిధిలోని అమ్మపాలెం గ్రామంలో శ్రీరామాలయం సెంటర్ నందు గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి వద్ద ఆదివారం మహాకుంకుమ పూజను నిర్వహించారు.



సత్తుపల్లిలో..



కల్లూరులో..



చింతకానిలో నగదు అలంకరణలో గణపతి



కొణిజర్లలో కుంకుమార్చన చేస్తున్న భక్తులు

అలుగు ఆక్రమణతో.. పొలాల్లోకి వరదనీరు

▸▸ 50 ఎకరాల వరి పంటకు నష్టం

▸▸ దిగాలు పడ్డ రైతులు..

కల్లూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నకోరుకొండి గ్రామంలో ప్రధానంగా రెండు చెరువుల వరదనీరు పారే వాగు ఆక్రమణతో ఆ నీరు ముందుకు పారుదల అయ్యే అవకాశం లేక పోటేత్తాయి. దీంతో వాగు సమీపాన గల సుమారు 50 ఎకరాల వరిపైరు నీటి ముంపుతో రైతులకు తీవ్రంగా నష్టం వాటిల్లింది. సాగు చేసిన వరి పైరు వరదనీటి ముంపునకు గురికావడంతో బాధిత రైతులు దిగాలు పడ్డారు. మండలంలోని చిన్నకోరుకొండి గ్రామంలోని చింతల చెరువు, వెంపటి చెరువులు వరద నీటి ప్రవాహంతో పూర్తిగా నిండిపోవడంతో అలుగు పారాయి. ఈ వదర నీరు సమీపాన గల వాగు నుంచి పోటెత్తి ఎంతకు తగ్గని పరిస్థితి. నాలుగు రోజులుగా సుమారు 50 ఎకరాల వరకు వరి పంట నీటి ముంపులోనే ఉంది. దీంతో ఈ వరి పైరును సాగు చేసిన వారు అంత సన్న, చిన్నకారు రైతులు కావడంతో అందరూ వ్యవసాయంపైనే ఆధార పడి జీవిస్తున్నారు. సదరు చెరువుల వద్ద ప్రవహిస్తున్న వాగుకు ఇరువైపుల గల భూమిని ఆక్రమణ చేయడంతో వాగు విస్తీర్ణం తగ్గి ఇలా వరద నీరు పోటెత్తింది. ఇప్పటికే ఈ పంట సాగుకు ఎకరానికి సుమారు రూ.15 వేల వరకు పెట్టుబడులు పెట్టారు. జలవనరుల శాఖ అధికారులు స్పందించి ఇప్పటికైన చింతల చెరువు, వెంపటి చెరుల మధ్యన గల వాగును విస్తీర్ణంతో పెంచుతూ వరదనీరు పోటెత్తకుండా తగిన విధంగా చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు వడ్లమూడి రామకృష్ణ, ఖమ్మంపాటి నాగేశ్వరరావు, రెడ్డి శ్రీకాంత్, ఖమ్మంపాటి రామకృష్ణ కోరుతున్నారు.



చిన్నకోరుకొండిలో పొల్లాలోకి పోటేత్తిన వరదనీరు

నృత్య కళాభారతి కళాకారులకు పురస్కారాలు

వైరా, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వైరాకు చెందిన నృత్య కళాభారతి కళాకారులు సేవ పురస్కారాలను దక్కించుకున్నారు. భద్రాద్రి సాంస్కృతిక వారధి ఆధ్వర్యంలో హైదరాబాద్ రవీంద్రభారతి కళా ఆడిటోరియంలో నృత్యోత్సవాలు నిర్వహించారు. వైరా, ఖమ్మంకు చెందిన కళాకారులకు అందిన ప్రత్యేక ఆహ్వానం మేరకు ఉత్సవాల్లో నృత్య కళారూపాలను ప్రదర్శించారు. వైరాకు చెందిన జి.రక్షిత్, ఉపన్యా, ఆద్యా, చేతనశ్రీ, హారిక, పల్లవి, మయూక, గోపిక కళాకారులు శ్రీహరివాసం నృత్యరూప కళాప్రదర్శనలతో ప్రత్యేక బహుమతులను అందుకున్నారు. వైరా కల్చరల్ అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రోత్సాహంతో పీవీ.నటరాజ్, పి.మహేష్ చిన్నారులకు శిక్షణ ఇచ్చి ఇక్కడ కళారూపాలను ప్రదర్శింపజేశారు. తెలంగాణ సాంస్కృతిక విభాగం కోకన్వీనర్ సీహెచ్.కొండలరావు చేతులమీదుగా ఈ చిన్నారులు బహుమతులను అందుకున్నారు.



సేవ పురస్కారాలు అందుకున్న చిన్నారి కళాకారులు

తుంబూరులో కోళ్లకు బర్డ్‌ఫ్లూ కాదు ఐబీహెచ్

» కాకర్లపల్లి పశువైద్యాధికారి శశిదీప్ వెల్లడి

సత్తుపల్లిరూరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): తుంబూరు పౌల్ట్రీ ఫామ్‌లలో వేల సంఖ్యలో కోళ్ల చనిపోవడం అవాస్తవమని, ఈ సీజన్‌లో సాధారణంగా ఇంక్లూజన్ బాడీ హెపటైటిస్ (ఐబీహెచ్) వంటి డిసీజ్ కోళ్లకు సోకుతుందని కాకర్లపల్లి పశువైద్యాధికారి డా.శశిదీప్ ఆదివారం తెలిపారు. గత రెండు మూడు రోజులుగా తుంబూరులోని కోళ్లఫారంలో సుమారు 350వరకు చనిపోయినట్లు గమనించానని, వాటికి ముందుగానే మెడిసిన్ వాడినట్లయితే మూడు రోజులలో రికవరీ అయ్యే అవకాశం ఉండేదని, రైతులు తమ సూచనలు, సలహాలు ఎల్లవేళలా తీసుకోవాలని కోరారు. ఇటీవల మారిన వాతావరణం కారణంగా కోళ్లకు ఈ డిసీజ్ వచ్చి ఉండవచ్చునని, నీళ్ల ముఖ్య కారణమని, బయోసెక్యూరిటీ మెజర్స్ పాటిస్తే కోళ్లకు ఎటువంటి రోగాలు రావని చెప్పారు. అదేవిధంగా రోగాలు వచ్చినవి, మృత్యువాత పడిన కోళ్లను ఫామ్ పరిధిలోని భూమిలో తవ్వి పూడ్చి వేయాలని, అనుమానాలు ఉన్నట్లయితే కోళ్లను ల్యాబ్‌లో పరీక్షించుకోవచ్చునని చెప్పారు.



రైతుతో మాట్లాడుతున్న పశువైద్యాధికారి

ఇది ఆర్‌అండ్‌బీ రోడ్డేనా..!

వైరా, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వైరా-నెమలి రూట్లో పినపాక క్రాస్‌రోడ్డు-సిరిపురం గ్రామాల మధ్య ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు పొలాలకు వెళ్లే డొంక రోడ్ల కంటే అత్యంత అధ్వానంగా ఉంది. ముఖ్యంగా పినపాక క్రాస్‌రోడ్డు నుంచి సిరిపురం సమీపంలోని గ్రీన్‌ఫీల్డ్ హైవే అండర్‌పాస్ హైలెవల్ వంతెన వరకు కిలోమీటర్ దూరం రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. మూడు అడుగుల లోతుకు పైగా రోడ్డు కుంగిపోయి గుంతలమయంగా మారింది. గడచిన ఐదారురోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో గుంతల్లో వర్షపు నీరు చేరి కొద్దిపాటి కుంటలను తలపిస్తోంది. ద్విచక్ర, త్రిచక్ర వాహనాలతోపాటు కార్ల రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా ఉంది. ఆటోలు, కార్లు ఈ గుంతల్లో వెనుకా ముందు భాగాల్లో గుద్దుకొని దెబ్బతింటున్నాయి. ఒక్కోసారి గుంతల్లో పడి చెడిపోతున్నాయి. ద్విచక్రవాహనాల వారు ఈ గుంతల్లో పడిపోతూ గాయాలపాలవుతున్నారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు నిర్మాణం కోసం భారీ టిప్పర్లలో అధిక లోడ్‌తో మెటీరియల్ తీసుకువెళ్లడంతో ఈ రోడ్డు మొత్తం ధ్వంసమైంది. గత మూడునెలల నుంచి ఈ రూట్లోని 15గ్రామాల ప్రజలు ఈ గుంతల వల్ల తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అయినప్పటికీ స్థానిక ఆర్ అండ్‌బీ అధికారులు ఈ రోడ్డును కన్నెత్తి కూడా చూడడం లేదు. కనీసం గుంతల్లో నిలిచిన వర్షపు నీటిని కూడా వెళ్లదీయడం లేదు. తమ వాహనాల వలన ఈ రోడ్డు ధ్వంసమైనప్పటికీ గ్రీన్‌ఫీల్డ్ హైవే అధికారులు కానీ, కాంట్రాక్టర్ కానీ ఈ భారీ గుంతలకు కనీస మరమ్మతులు చేయాలనే కనీస స్పృహ కూడా లేకుండాపోయిందని ఈ రూట్ ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఈ గుంతలకు మరమ్మతులు చేయడం గ్రీన్‌ఫీల్డ్ హైవే కాంట్రాక్టర్‌కు పెద్ద సమస్య కాదని తమ వాహనాల రాకపోకలతో దెబ్బతిన్న ఈ రోడ్డుకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయాలని ఈ రూటు ప్రజలు కోరుతున్నారు.



పినపాక క్రాస్‌రోడ్డు-సిరిపురం మధ్య ధ్వంసమైన రోడ్డు

జింకలగూడెం సమస్యలను పరిష్కరించాలి

వైరా, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటిపూడి గ్రామపంచాయతీ పరిధిలోని జింకలగూడెం గ్రామ సమస్యలను పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి బాణాల శ్రీనివాసరావు, మాజీ కార్యదర్శి తోట నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. జింకలగూడెం గ్రామంలోని సమస్యలపై ఆదివారం సీపీఎం బృందం సర్వే చేసింది. అనంతరం ఆసమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వైరా-మదిర, జగ్గయ్యపేట ఆర్‌అండ్‌బీ రోడ్డుపై రాస్తారోకో చేసింది. ఈ సందర్భంగా శ్రీనివాసరావు, నాగేశ్వరరావు మాట్లాడుతూ మండల కేంద్రమైన వైరాకు కేవలం ఏడుకిలోమీటర్ల దూరంలో మధిర వెళ్లే ప్రధాన రోడ్డు పక్కనే ఉన్న జింకలగూడెం సమస్యలతో కొట్టుమిట్టాడుతుందని ఆరోపించారు. ఇందిరమ్మ ఇళ్లు, వితంతు, దివ్యాంగ పింఛన్లు అర్హులైన వారికి రాలేదని ఆరోపించింది. గ్రామంలోని రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా ఉందని, సీజనల్ వ్యాధులతో ప్రజలు అనారోగ్యం పాలయ్యారని, వెంటనే పారిశుద్యాన్ని మెరుగుపర్చాలని, జింకలగూడెంను గ్రామపంచాయతీ చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు షేక్.బిలాల్, ఖాసీం, లాల్‌బాషా, కరీం, చిన్నఅలావలి, రహమాబీ, చాంద్‌బీ, సైదాబీ పాల్గొన్నారు.



రాస్తారోకో చేస్తున్న సీపీఎం నాయకులు